సహజీవన భావనల పావురాయి

# పావురాయి

వారపత్రిక 3-7-2026 ₹ 15/-

# ద్రవ్యోల్బణం








# గీటురాయి వారపత్రిక

# GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 48 సంచిక: 27 హైదరాబాద్
శుక్రవారం 3 జూలై 2026 రూ.15-00
ముహర్రమ్ 17 1448 హిజ్రీ


**తొలిగీటు**

సంయమనం గల వ్యక్తి వల్లనే పొరపాట్లు కూడా జరుగుతాయి. అనుభవజ్ఞుడైన వ్యక్తే వివేచనాపరుడు కాగలడు.

*(మిష్కాత్)*


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


24



## గుర్తింపులేని గృహభారం

## లోపల...


| | |
|---|---|
| కృత్రిమ మేధస్సుపై ఆంక్షలు ...... | 04 |
| ద్రవ్యోల్బణం ...... | 05 |
| ముస్లిం సమాజం విద్యా ప్రయాణం, సవాళ్ళు – 2 ...... | 08 |
| వర్షం... వరం ...... | 11 |
| అసంపూర్తి: ఆలోచనలు – ఆచరణలు ...... | 12 |
| నేను భారతీయుడిని... ద్వేషానికి నదీం సమాధానం! ...... | 14 |
| నిస్సహాయ మానవుడు.. అంతుచిక్కని విశ్వం ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... | 19 |
| న్యాయ వ్యవస్థకు సవాల్‌గా మారుతున్న మూకదాడులు ...... | 20 |
| ముహర్రం సందేశం ...... | 23 |
| మేలు చేసేవారు అల్లాహ్‌కు ఇష్టులు ...... | 26 |
| సైన్స్ ప్రగతి – నాలుగు ప్రధాన ప్రభావాలు–3 ...... | 30 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |


### సన్నాసుల పాలన




మోడలంట దేశానికి
మొదనష్టపు పాలన
యోగి దర్శకత్వంలో
గూండాలకు ఆలన!

కాల్చుడు, కూల్చుడే
పరిపాలన నమూన
ఇంత కన్న దుర్మార్గం
ఏముంటది నాయన!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## కృత్రిమ మేధస్సుపై ఆంక్షలు

**అమెరికా ప్రభుత్వం** ఏఐ సంస్థ ఆంత్రోపిక్ సంస్థను కట్టడి చేసింది. ఆంత్రోపిక్ ఏఐ మోడల్స్ 'క్లాడ్ ఫేబుల్ 5' 'మిథోస్ 5'లు అమెరికాలో తప్ప ఇతర దేశాల ప్రజలకు ఇవ్వరాదని ఆదేశించింది. ఆంత్రోపిక్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఈ మోడల్స్‌ను అకస్మాత్తుగా నిలిపివేయాల్సి వచ్చింది. అమెరికా అధికారులు లేవనెత్తిన జాతీయ భద్రతా ఆందోళనల వల్లే ఈ చర్య తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది. అయితే, అమెరికా ప్రభుత్వం తమకు చూపించిన ఆధారాలు ఇంత విస్తృతమైన ఆంక్షలను సమర్థించేలా లేవని ఆంత్రోపిక్ చెబుతోంది. కాని ప్రభుత్వ ఆదేశాలను పాటించడం తప్ప తమకు వేరే మార్గం లేదని కంపెనీ చెప్పింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రభుత్వాలు నియంత్రించడానికి ఎలా ప్రయత్నిస్తున్నాయో ఈ పరిణామం సూచిస్తుంది. ఇప్పటివరకు, ఏఐ వ్యవస్థలు తయారు చేయడానికి ఉపయోగపడే చిప్స్, హార్డ్‌వేర్‌పై ఆంక్షలు విధించిన వారు ఇప్పుడు ఏఐ మోడల్స్ పై కూడా ఆంక్షలు విధిస్తున్నారు.

అమెరికా ప్రభుత్వం ఇలా ఎందుకు చేసిందన్న ప్రశ్న ఆలోచించవలసిన ప్రశ్న. ఆంత్రోపిక్ ప్రకారం, ఫేబుల్ 5లో పొందుపరిచిన భద్రతా వలయాలు బలంగా లేవన్నది అమెరికా అధికారుల వాదన. మిథోస్ మోడల్‌లో అంతర్లీనంగా ఉన్న శక్తివంతమైన సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలను వినియోగదారులు యాక్సెస్ చేయకుండా ఆపడానికి ఈ భద్రతా వలయాలు ఉన్నాయి. అమెరికా ప్రభుత్వ ఆందోళన ఏమిటంటే, ఈ అధునాతన ఏఐ సిస్టమ్‌లు నేరస్తుల చేతుల్లోకి వెళితే, వాటిని ఉపయోగించి సాఫ్ట్‌వేర్ లోపాలను కనుగొనవచ్చు లేదా సైబర్ దాడులను నిర్వహించవచ్చు. ఈ సమస్య చాలా పరిమితమైనదని, గతంలోనే తెలిసిన స్వల్ప లోపాలకు మాత్రమే సంబంధించినదని ఆంత్రోపిక్ చెబుతోంది. పబ్లిక్‌గా అందుబాటులో ఉన్న ఇతర ఏఐ మోడల్స్ కూడా ఇలాంటి లోపాలను గుర్తించగలవని, కేవలం ఈ సమస్య ఆధారంగా కఠినమైన నిషేధాన్ని విధించడం సమర్థనీయం కాదని కంపెనీ వాదిస్తోంది.

అమెరికా అధికారులు ఈ వాదనను విభేదిస్తున్నారు. శక్తివంతమైన ఏఐ మోడల్స్‌ను ఉపయోగించి బ్యాంకులు, ప్రభుత్వ వ్యవస్థలు, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై సైబర్ దాడులు జరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అమెరికా అధికారులు ఇప్పుడు అధునాతన ఏఐ మోడల్స్‌ను కేవలం ఒక సాంకేతిక ఉత్పత్తిగా కాకుండా ఒక జాతీయ భద్రతా సమస్యగా పరిగణించడం ప్రారంభమయ్యింది.

ట్రంప్ ప్రభుత్వానికి, ఆంత్రోపిక్ కంపెనీకి మధ్య గత కొంత కాలంగా ఉన్న విభేదాలు, వివాదాల నేపథ్యంలో ఈ ఆంక్షలు వచ్చాయి. ఈ ఏడాది ప్రారంభంలో పూర్తి ఆటోమేషన్ కలిగిన ఆయుధ వ్యవస్థల కోసం తమ ఏఐ మోడల్స్‌ను అనుమతించేది లేదని ఆంత్రోపిక్ అమెరికా ప్రభుత్వ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఆ తర్వాత ఆంత్రోపిక్ సంస్థ ఏఐ మోడల్ విషయంలో అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఒక కొత్త ఉరవడికి నాంది పలికేదిగా కనిపిస్తోంది. ఇకపై ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానంపై కూడా ఆంక్షలు విధించవచ్చని అర్థమవుతోంది. సాఫ్ట్ వేర్ పై కూడా నియంత్రణలు రావచ్చు. అంటే రానున్న రోజుల్లో ఓపెన్ సోర్స్ అనేది ఎంతవరకు అందుబాటులో ఉంటుందనేది సందేహాస్పదమే.

ఈ ఆంక్షలు మనకు మేలుకొలుపు కావాలి. మారిన పరిణామాల నేపథ్యంలో గ్లోబలైజేషన్ అనేది తెరమరుగవుతోంది. ప్రతిదేశం తన సొంత సార్వభౌమ ఏఐ సామర్థ్యాలను నిర్మించుకునే వాతావరణం ఏర్పడుతోంది. విదేశీ ఏఐ కంపెనీలపై పూర్తిగా ఆధారపడే బదులు, భారతదేశం కూడా ఏఐ పరిశోధనల్లో మరింత ఎక్కువగా పెట్టుబడులు పెట్టవలసిన అవసరం ఉంది. ఇటీవల ఢిల్లీలో ఏఐ సమ్మిట్ జరిగింది. కాని ఆ సమ్మిట్‌లో వైఫై సదుపాయం కూడా సక్రమంగా లేదన్న వార్తలు వచ్చాయి. బలమైన ఏఐ వ్యవస్థలు నిర్మించుకోవాలంటే భారీగా నిధులు అవసరం. ఆ స్థాయిలో ప్రభుత్వ నిధులు, ప్రయివేటు పరిశోధనలు మన దేశంలో జరుగుతున్నాయా అన్నది అందరు ఆలోచించవలసిన ప్రశ్న.

**కవరు కథనం** **అబ్దుల్ వాహెద్**

# ద్రవ్యోల్బణం



**అమెరికా ఈరాన్** దేశాల మధ్య యుద్ధం వల్ల ఇంధన ధరలు పెరిగాయి. వాటి వల్ల రవాణా ఖర్చులు పెరిగాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆర్బీఐ మరో పిడుగుపాటు లాంటి వార్త చెప్పింది. యుద్ధం ముగిసి శాంతిచర్చలు ప్రారంభమైనప్పటికీ దేశంలో రుతుపవనాలు బలహీనంగా ఉండడం వల్ల వ్యవసాయం కుంటుపడి నిత్యావసర వస్తు ధరలు పెరిగే అవకాశం ఉందని చెప్పింది.

భారతదేశం వ్యవసాయ రంగంపై అధిక శాతం ఆధారపడి ఉంది. గ్రామీణ మార్కెట్ డిమాండ్ కూడా చాలా వరకు వర్షపాతం పైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల తక్కువ వర్షపాతం నమోదైతే అది నేరుగా ఆహార ఉత్పత్తిని దెబ్బ తీస్తుంది. దీంతో నిత్యావసరాల ధరలు భారీగా పెరుగుతాయి. ఇది అధిక ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. దీని వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గుతుంది. పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్‌ల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం అంతర్జాతీయ మార్కెట్లకు కాస్త ఊరటనిచ్చే విషయం అయినప్పటికీ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు.

ప్రస్తుతం పరిస్థితి చూస్తే ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రైవేట్ ఉద్యోగాల్లో కోతలు మరింత ఎక్కువయ్యే సూచనలు కనబడుతున్నాయి. ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను అదుపు చేయలేకపోతే, దేశంలోని చాలా మంది ప్రజలు నిత్యావసర వస్తువులు కూడా కొనడం కష్టమయ్యే పరిస్థితి రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సబ్బులు, నూనె, టూత్‌పేస్ట్, బిస్కెట్లు, చాక్లెట్ల ధరలు పెరిగాయన్నది వార్తల్లో ఎక్కడా కనిపించదు. డీజిల్, పెట్రోల్, సిలిండర్ ధరల గురించి వార్తలు మాత్రమే మీడియాలో కనిపిస్తుంటాయి. అవసరం కోసం చిన్న చిన్న రుణాలు తీసుకునేవారు చాలా మంది ఉంటారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఉపాధి లేకపోవడం వల్ల ఇలాంటి వారు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 25 లక్షల మందికి పైగా చిన్న రుణాలు తీసుకున్న వారు తమ వాయిదాలను సమయానికి చెల్లించలేకపోతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. సుమారు 3 లక్షల కోట్లు క్రెడిట్ కార్డుల బకాయిలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. చాలా మంది మ్యూచువల్ ఫండ్లలో ప్రతి నెలా పెట్టుబడి పెడుతుంటారు. తాజా డేటా ప్రకారం, మే నెలలో ఈ పెట్టుబడుల ఇన్‌ఫ్లో 40% తగ్గిపోయిందని తెలుస్తోంది. దాదాపు 30 నుంచి 40% మంది తమ రుణాలపై నెలసరి వాయిదాలు కట్టలేక ఆపేశారు.

మరోవైపు ఎల్–నినో ప్రభావం మొదలైంది. ఈ ప్రభావం వ్యవ

సాయంపై పడవచ్చు. అంతర్జాతీయంగా ముడి చమురు ధర తగ్గినా మన దేశంలో ధరలు పెంచారు. సిలిండర్ల ధరలు పెరగడం వల్ల వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారాలు దెబ్బతిన్నాయి.

సంపాదనే తక్కువై, ఖర్చులు ఎక్కువ కావడం నేడు ప్రజల సమస్య. అమ్మకాలు తగ్గినప్పుడు, ధరలు పెంచి లాభాలను కాపాడుకోవాలని కంపెనీలు చూస్తాయి. కానీ ధర పెరిగేకొద్దీ డిమాండ్ తగ్గిపోతుంది. ఇది ఆర్థిక సూత్రం. మధ్యతరగతి చేతిలో డబ్బులు ఉంటేనే కొనుగోలు శక్తి పెరుగుతుంది. ప్రజల చేతుల్లో డబ్బులు ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే ఆర్థికవ్యవస్థ సజావుగా నడుస్తుంది.

వస్తు, సేవల పన్ను (GST) రాబడుల డేటా కూడా దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నట్లు స్పష్టం చేస్తోంది. గత ఆరు నెలల్లో దేశీయ జీఎస్టీ రాబడుల సగటు వృద్ధి కేవలం 3.1% మాత్రమే అని తెలుస్తోంది. జీతాలు, ఆదాయాల్లో పెరుగుదల లేకపోవడం, ద్రవ్యోల్బణం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ద్వారా కొలిచే రిటైల్ ద్రవ్యోల్బణం, ఆహార ధరలు పెరగడంతో మే నెలలో 3.9 శాతానికి పెరిగిందని, ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం రేటు 3.5 శాతంగా ఉందని తెలుస్తోంది. జనవరి 2025లో ఈ సూచీ 4.06% పెరిగిన తర్వాత, రిటైల్ ధరలు మళ్లీ అత్యంత వేగంగా పెరిగాయి. రిటైల్ ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధానంగా ఆహార ధరలు పెరగడమే కారణమని చెప్పవచ్చు. మునుపటి నెలలో 4.2 శాతంగా ఉన్న కన్స్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్ (CFPI) ద్రవ్యోల్బణం 2026 మే నెలలో 4.8 శాతానికి ఎగబాకింది. రుతుపవనాలు ఇప్పటికే ఆలస్యమయ్యాయి. గృహ, నీరు, విద్యుత్, గ్యాస్, ఇతర ఇంధనాల ద్రవ్యోల్బణం మే 2026లో 1.73 శాతానికి చేరుకుంది.

ప్రస్తుతం టోకు ధరల సూచీ (WPI) 9.6% గా ఉంది. గత 26 నెలల్లో ఇదే అత్యధికం. విదేశీ వాణిజ్య లోటును పరిశీలిస్తే, అది 28.21 బిలియన్ డాలర్లుగా ఉంది. అలాగే, మనం నిరుద్యోగం రేటును చూస్తే అది 5.5% గా ఉంది. లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (LFPR) 54.4% గా ఉంది, ఇది గత 11 నెలల్లో అత్యల్పం. దీనితో పాటుగా, విదేశీ మారకద్రవ్య నిల్వల (Foreign Exchange Reserves) పై దృష్టి పెడితే, అందులో కూడా మనకు ఆందోళన కలిగించే అంశాలు కనిపిస్తున్నాయి. 671.63 బిలియన్ డాలర్లుగా ఉన్న మన నిల్వల్లో గత ఏడాదితో పోలిస్తే 13% క్షీణత నమోదైంది.

ద్రవ్యోల్బణం పెరుగుతోంది. అదే సమయంలో నిరుద్యోగం కూడా పెరుగుతోంది. విదేశీ మారకద్రవ్య నిల్వలు తరుగుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని కొలిచే మరొక కొత్త అంచనాను ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసింది. దానిని 'ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్' (PPI) లేదా అవుట్‌పుట్ ప్రైస్ ఇండెక్స్ అంటారు. వాస్తవానికి, ఈ సూచీ అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఐరోపాలలో ఎక్కువగా వాడతారు. టోకు ధరల సూచీ అంటే మార్కెట్లో టోకు ధరకు వస్తువులు ఏ రేటుకు లభిస్తున్నాయి అనేది. కానీ, అవుట్‌పుట్ ప్రైస్ ఇండెక్స్ అనేది ఒక వస్తువు ఫ్యాక్టరీ నుండి బయటకు వస్తున్నప్పుడు, అనగా ఫ్యాక్టరీ గేట్ దగ్గర దాని ధర ఎంత అనేది సూచిస్తుంది. కంపెనీలు తమ ఉత్పత్తి పూర్తయిన తర్వాత వస్తువుల ధరలను ఎంత మేర పెంచుతున్నాయో దీనివల్ల మనకు అర్థమవుతుంది. దీనికి సంబంధించిన మొదటి అంచనా ఇప్పుడు వచ్చింది. అవుట్‌పుట్ ప్రైస్ ఇండెక్స్ కూడా 9.4% గా ఉంది. టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం లేదా ఇప్పుడు వచ్చిన అవుట్‌పుట్ ప్రైస్ ఇండెక్స్ లాంటి ద్రవ్యోల్బణాన్ని మనం గతంలో 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు చూశాము. ఆ తర్వాత ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు కూడా పెరిగాయి. 2009–10 కాలంలో చాలా ఇబ్బందులు, కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

దీనికి ప్రధాన కారణం ముడి చమురు. ఎందుకంటే టోకు ధరల సూచీలో ముడి చమురు వాటా చాలా పెద్దది. ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ముడి చమురు ధరలు బ్యారెల్‌కు వంద డాలర్ల మార్కును దాటి పైకి చేరుకున్నాయి. ఇప్పుడు శాంతి చర్చలు జరుగుతున్నాయి. ముడి చమురు ధరలు కొద్దిగా తగ్గాయి. యుద్ధానికి ముందున్న పరిస్థితి అంటే బ్యారెల్‌కు 65–70 డాలర్ల స్థాయికి ఇంకా చేరుకోలేదు.

ఈరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు ధర పెరిగింది. కాగా ఇప్పుడున్న గ్లోబల్ కమోడిటీ మార్కెట్‌లో ఒక 'సూపర్ సైకిల్' నడుస్తోందని ఆర్థికవేత్తలు అంటున్నారు. అసలు ఈ సూపర్ సైకిల్ అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. కమోడిటీల సరఫరాతో పోలిస్తే డిమాండ్ భారీగా పెరిగి, వాటి ధరలు నిరంతరంగా పెరిగే కాలాన్ని సూపర్ సైకిల్ అంటారు. ముఖ్యంగా ఈసారి ఇది లోహాల డిమాండ్ ఆధారితంగా నడుస్తోంది. గత 200 ఏళ్లలో మనం ఈ సూపర్ సైకిల్‌ను చూడటం ఇది ఐదవసారి అంటున్నారు. మొదటిసారి 1890లో ఇలా జరిగింది. పారిశ్రామిక విప్లవం తర్వాత, ఐరోపా అంతా


పారిశ్రామికీకరణ చెందుతున్న సమయంలో ఇనుము, రాగి, అల్యూమినియం డిమాండ్ పెరిగింది. ఆ తర్వాత 1930లలో 'గ్రేట్ డిప్రెషన్' తర్వాత, మళ్లీ ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం ప్రారంభించినప్పుడు ఒక సూపర్ సైకిల్ ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, అమెరికా జపాన్ పారిశ్రామికీకరణ చాలా వేగంగా జరిగినప్పుడు 1960లలో మనకు ఒక సూపర్ సైకిల్ కనిపించింది. ఆ తర్వాత 1990ల చివరి నాటికి మరో సూపర్ సైకిల్ ప్రారంభమైంది. ఆ సమయంలో అమెరికా, చైనా మాన్యుఫాక్చరింగ్ బూమ్ మొదలైంది. అప్పట్లో చైనాలో ఒలింపిక్ క్రీడలు జరిగాయి, అందువల్ల మార్కెట్‌లో ఇనుము, అల్యూమినియం, స్టీల్ వంటి వాటి ధరలు బాగా పెరగడం ప్రారంభించాయి. ఆ తర్వాత మనం ఇప్పుడు చూస్తున్నది ఐదవ సూపర్ సైకిల్.

ఇక్కడ ముందుగా బంగారం ధర పెరిగింది, ఆ తర్వాత వెండి ధర పెరిగింది. వెండి ఒక ముఖ్యమైన పారిశ్రామిక ముడిసరుకు. ఆ తర్వాత ఇప్పుడు రాగి (కాపర్) ధర పెరగడం చూస్తున్నాము. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్లడానికి చేస్తున్న ప్రయత్నాల వల్ల, కోబాల్ట్, కాపర్, లిథియం (లిథియం బ్యాటరీలలో వాడతారు) వంటి కొన్ని లోహాల డిమాండ్ భారీగా పెరిగింది. మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కోసం పెద్ద పెద్ద డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాలను నిర్మించాల్సి వస్తోంది. అక్కడ కూడా అల్యూమినియం, స్టీల్ వంటి వాటి డిమాండ్ పెరుగుతోంది. గ్లోబల్ కమోడిటీ మార్కెట్‌లో నడుస్తున్న ఈ సూపర్ సైకిల్ వల్ల మనపై కూడా ప్రభావం పడుతుంది. ఒకవైపు ముడి చమురు ధరలు ద్రవ్యోల్బణానికి కారణం. ముడి చమురు ధర కొద్దిగా తగ్గినా, గ్లోబల్ కమోడిటీ మార్కెట్‌లో నడుస్తున్న ఈ సూపర్ సైకిల్ వల్ల.. కాపర్ ధరలు, వెండి ధరలు, ఎలక్ట్రిక్ వాహనాల లిథియం బ్యాటరీలలో వాడే కోబాల్ట్, డేటా సెంటర్లలో ఉపయోగించే వస్తువులు, అలాగే వాటికి అవసరమైన నీరు.. వీటన్నింటి డిమాండ్ రాబోయే కాలంలో చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది రెండు వైపుల నుండి వస్తున్న ఒత్తిడి. అందుకే టోకు ధరల సూచీ పైకి వచ్చింది.

ఇక్కడ ప్రశ్న ఏమిటంటే, వస్తువులను తయారు చేసే కంపెనీలు, ముడిసరుకుల కోసం ఎక్కువ డబ్బు వెచ్చించాల్సి వస్తే, ఖచ్చితంగా ఆ భారాన్ని వినియోగదారుల పైనే మోపుతారు. ప్రస్తుతం ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు 4% దగ్గర ఉంది. ఆర్బీఐ టాలరెన్స్ లెవల్‌ను సవరించి 6% వరకు ఉంటే పర్వాలేదు అని నిర్దేశించింది. కానీ రాబోయే రోజుల్లో రిటైల్ ద్రవ్యోల్బణంపై కూడా ఒత్తిడి పెరగవచ్చు. అప్పుడు వినియోగదారుడు ప్రత్యక్షంగా దెబ్బతింటాడు.

కార్పొరేట్ రంగానికి చెందిన 'ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్' అంటే టూత్ బ్రష్, టూత్ పేస్ట్, సబ్బులు, రోజూ తినే వస్తువులను తయారు చేసే కంపెనీల త్రైమాసిక ఆదాయ నివేదికలు పరిశీలిస్తే, లిస్టెడ్ కంపెనీలైన దాదాపు 3700 కంపెనీల లాభాలు, అమ్మకాలను చూస్తే వృద్ధి కనిపించింది. దీనికి కారణం మార్కెట్లో కంపెనీలు తమ వస్తువుల ధరలను పెంచేశాయి. ఒక వినియోగదారుడు తను రోజూ వినియోగించే వస్తువుల కోసం 8 నుండి 10% ఎక్కువ డబ్బు చెల్లిస్తున్నాడు. అందువల్ల వృద్ధి కనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోగలదు? అనేది ప్రశ్న. ఇరాన్ యుద్ధం కాస్త సద్దుమణిగింది కాబట్టి ముడి చమురు ధర తగ్గాలి. తగ్గేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎల్పీజీ ధర మరింత పెరిగితే, రెస్టారెంట్‌కు భోజనానికి వెళ్తే అక్కడ ధరలు పెరుగుతాయి. కేవలం ఎల్పీజీ ధర పెరగడమే కాదు, రేషనింగ్ అమలులో ఉంది కాబట్టి బ్లాక్ మార్కెట్ నుండి కొనుగోలు చేస్తారు. బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్ అధికధర పలుకుతుంది. ఇవన్నీ ధరలు పెరగడానికి కారణమవుతాయి.

డీజిల్ రేటు పెరిగితే ట్రాక్టర్లు, పంపుసెట్లు నడపడానికి డీజిల్ కొనే రైతు నష్టపోవాల్సి వస్తుంది లేదా వ్యవసాయోత్పత్తుల ధరలు పెరగాలి. మళ్లీ ద్రవ్యోల్బణం పెరుగుతుంది, ఎందుకంటే పెట్రోల్, డీజిల్ అనేవి అన్ని వస్తువులకు ప్రధాన ఇన్‌పుట్ (ముడి వనరులు). రాగి ధర పెరిగినా దాని ప్రభావం ఉంటుంది. విద్యుత్ పరికరాలు, ట్రాన్స్ ఫార్మర్ల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణంతో పాటు నిరుద్యోగానికి సంబంధించి గణాంకాలు చూస్తే, కొన్ని విషయాలు అర్థమవుతాయి. ఖర్చులు పెరగడం వల్ల డిమాండ్ పడిపోతుంది. పెట్టుబడిదారులు ఎక్కువ పెట్టుబడులు పెట్టరు. కంపెనీలు తమ వ్యాపారాన్ని విస్తరించడానికి వెనుకాడతాయి, దాని ప్రభావం ఉపాధిపై పడుతుంది. కొత్త ఉద్యోగాలు, కొత్త నియామకాలు జరగవు. నిజం చెప్పాలంటే ఇది కష్టకాలం. విపక్ష నేత రాహుల్ గాంధీ ఒక 'ఆర్థిక సునామీ' రాబోతోందని చెబుతున్నారు. ఆర్థిక సంక్షోభం మనం కూడా చూస్తున్నాం. ఈరాన్ యుద్ధం ఆగిపోయింది కాబట్టి అంతా సర్దుకుంటుందని అనుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఈ పరిస్థితులను అర్థం చేసుకుని, సామాన్యుడిపై పడుతున్న ద్రవ్యోల్బణ భారాన్ని తగ్గించడానికి లేదా కనీసం ఆ భారంలో కొంతైనా ప్రభుత్వం పంచుకోవడానికి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ✤




## విజ్ఞాన వారసత్వం

# ముస్లిం సమాజం విద్యా ప్రయాణం, సవాళ్ళు

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**(గత సంచిక తరువాయి)**

### మౌలానా ఆజాద్

**మౌలానా అబుల్ కలాం ఆజాద్ (1888–1958)**

స్వాతంత్ర్యోద్యమ అగ్రనేత, ప్రఖ్యాతిగాంచిన పండితుడు, స్వతంత్ర భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్. కేవలం పద్నాల్గేళ్ల ప్రాయంలోనే 'అల్ – హిలాల్' పత్రిక ద్వారా ముస్లింలలో జాతీయ భావాలను, విద్యా చైతన్యాన్ని రగిలించిన ధీశాలి ఆయన. విభజన రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, హిందూ – ముస్లిం ఐక్యత కోసం, దేశ సమగ్రత కోసం జీవితాంతం పోరాడారు.

స్వతంత్ర భారతదేశం ఏర్పడిన తర్వాత దేశ విద్యా వ్యవస్థకు ఆయనే రూపశిల్పిగా మారారు. నాడు దేశంలో ఉన్న నిరక్షరాస్యతను రూపుమాపడానికి 'అక్షరాస్యత అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు' అని ప్రకటించి, ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా విధానానికి బలమైన పునాది వేశారు. కేవలం ప్రాథమిక విద్యకే పరిమితం కాకుండా, దేశాన్ని సాంకేతికంగా, శాస్త్రీయంగా ముందంజలో ఉంచేందుకు ఆయన ఎంతో దూరదృష్టితో వ్యవహరించారు. నేడు దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీలు (IITs), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (IISc), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (AICTE) వంటి ఉన్నత విద్యా సంస్థల

స్థాపన ఆయన ఆలోచనల నుండే పురుడు పోసుకున్నాయి. అంతేకాకుండా, దేశంలో కళలు, సంస్కృతి, సాహిత్య పరిశోధనలను ప్రోత్సహించడానికి సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీలను కూడా ఆయనే నెలకొల్పారు. ఒక వైపు పవిత్ర ఖురాన్‌కు 'తర్జుమానుల్ ఖుర్‌ఆన్' పేరుతో అద్భుతమైన తాత్విక వ్యాఖ్యానం రాస్తూనే, మరోవైపు ఆధునిక, శాస్త్రీయ విద్యను దేశ ప్రజలందరూ అందిపుచ్చుకోవా లని ఆకాం క్షించిన మహోన్నత సంస్కర్త ఆయన. అందుకే ఆయన జన్మదినమైన నవంబరు 11ను భారతదేశం ప్రతి ఏటా 'జాతీయ విద్యా దినోత్సవం' (National Education Day) గా జరుపుకుంటూ ఆయనకు ఘన నివాళులర్పిస్తోంది.

## మౌలానా మౌదూది రహ్మ

**మౌలానా మౌదూదీ (రహ్మ) (1903–1979)** జ్ఞానాన్ని కేవలం సమాచార భాండాగారంగా కాకుండా, విశ్వాసం, ఆలోచన, స్వభావ పరిపక్వతకు పునాదిగా చూశారు. ఆయన దృష్టిలో విద్య అనేది మనిషిని మనిషిగా తయారు చేసే ప్రక్రియ. ఆ వ్యక్తి తౌహీద్‌పై నిలకడ గలవాడై, సత్యం కోసం నిలబడగల వాడై ఉండాలి, నైతికంగా ఉన్నతుడై ఉండాలి. ఆయన తన అనేక రచనలలో ఇస్లామీయ విద్యకు సంబంధించి సమకాలీన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే ప్రయత్నం చేశారు. మౌలానా అభిప్రాయం ప్రకారం, నిజమైన జ్ఞానం అంటే, దైవాన్ని పరిచయం చేసే జ్ఞానం, తనను తాను అర్థం చేసుకునే శక్తిని కలిగించే జ్ఞానం, సమాజాన్ని తెలుసుకునే జ్ఞానం. మౌలానా విద్యావ్యవస్థను తాత్వికంగా విశ్లేషించి, ఇస్లామీయ విజ్ఞాన నిర్మాణం ఎలా ఉండాలో తన రచనల్లో ప్రతిపాదించిన ప్రసిద్ధ ప్రజ్ఞాశీలి. విద్యా తాత్వికతపై ఆయన చేసిన రచనలు విద్యకు ప్రామాణిక రూపాన్నిచ్చాయి. 'తర్బీయత్', 'ఇల్మ్', 'అఖ్లాక్' మీద ఆయన రచనలు ముస్లింలలో విశేషమయిన తాత్విక అవగాహన పెంచాయి. తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ వ్యాఖ్యానం సహా, అల్ జిహాద్ ఫిల్ ఇస్లామ్, పరదా, రిసాలయే దీనియాత్, ఖుత్బాత్ లాంటి అనేక గ్రంథాలు ఆయన రచనలే.

సమకాలీన విద్యావ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ, కేవలం భౌతికవాద ప్రయోజనాల కోసం ఆర్జించే చదువు మనిషిని నైతికంగా దిగజారుస్తుందని ఆయన హెచ్చరించారు. సైన్స్, సోషల్, ఎకనామిక్స్ వంటి ఆధునిక సబ్జెక్టులను ఇస్లామీయ నైతిక చట్రంలో (Islamic framework) పునర్నిర్మించాల్సిన అవసరముందని ఆయన బలంగా వాదించారు. ఆయన అందిం చిన విద్యా తాత్వికత నేటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక ఇస్లామీయ విశ్వవిద్యాలయాల స్థాపనకు, పాఠ్యప్రణాళికల రూపకల్పనకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ప్రాపంచిక విద్యను దైవజ్ఞానంతో వేరుచేసి చూడకుండా, రెండింటినీ సమన్వయం చేసుకుంటూ సాగినప్పుడే ముస్లిం సమాజం సమర్థవంతమైన నాయకత్వాన్ని, సమాజ హితాన్ని సాధించగలదని మౌలానా మౌదూదీ స్పష్టం చేశారు. మౌలానా జమాతె ఇస్లామీ సంస్థ వ్యవస్థాపకులు కూడా!

## ఏపీజే అబ్దుల్ కలామ్

**డా. ఏపీజే అబ్దుల్ కలాం (1931–2015):** భారతదేశ 'మిస్సైల్ మ్యాన్', మనదేశ 11వ రాష్ట్రపతి. విజ్ఞానంలో, నైతికతలో, ప్రజాసేవలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. యువతలో సైన్స్, విజన్, దేశభక్తి మీద తన రచనలు, ఉపన్యాసాల ద్వారా వెలుగులు నింపారు.

ఇంతటి ఘన చరిత్ర కలిగిన ముస్లిం సమాజం నేడు విద్యలో ఎందుకు వెనకబడిందో ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

కలాం జీవితం నేటి ముస్లిం యువతకు ఒక గొప్ప పాఠం. పేదరికం, వనరుల లేమి వంటివి జ్ఞాన సముపార్జనకు ఏమాత్రం అడ్డంకి కాబోవని ఆయన తన స్వయంకృషితో నిరూపించారు. కేవలం సాంకేతిక నిపుణుడిగానే కాకుండా, మానవతా విలువలు, నైతికత కలిగిన ఒక సంపూర్ణ వ్యక్తిగా ఆయన జీవించారు. ముస్లింలు తమ పిల్లలను కేవలం డిగ్రీల కోసమో, ఉద్యోగాల కోసమో చదివించడం కాకుండా, దేశ ప్రగతిలో భాగస్వాములను చేసే పరిశోధకులుగా, శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆయన జీవితం మనకు సందేశాన్ని ఇస్తుంది. 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి' అన్న ఆయన పిలుపును అందుకొని, ముస్లిం సమాజం ఆధునిక సాంకేతిక రంగాలలో సరికొత్త శిఖరాలను అధిరోహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రాచీన ముస్లింల అనువాద విప్లవం

అబ్బాసీ ఖలీఫా అల్ మామూన్ కాలంలో 'బైతుల్ హిక్మా' (జ్ఞాన గృహం) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనిలో గ్రీసు, ఫార్సీ, సంస్కృత భాషల నుండి అనేక శాస్త్రీయ గ్రంథాలను అరబీలోకి అనువదించారు. ఇది ప్రపంచంలోనే మొదటి సారిగా పెద్ద స్థాయిలో జరిగిన అనువాద విప్లవం. ఇది ప్రపంచానికి విజ్ఞానాన్ని అందించే మార్గాన్ని సుగమం చేసింది. ఇస్లాం ధర్మం మానవ వికాసానికి, విజ్ఞాన సాంకేతికాభివృద్ధికి శక్తివంతమైన బీజం వేసిందని మనకు ఈ ఉదాహరణల ద్వారా తెలుస్తోంది.

ఇస్లామీయ పాండిత్యం ఒక భాషకు పరిమితం కాలేదు. అబ్బాసీ ఖలీఫాల కాలంలో సిరియాక్, పహ్లవీ, సంస్కృతం, గ్రీకు, లాటిన్ వంటి అనేక భాషల్లో గ్రంథాలను రచించారు, అనువదించారు. ముస్లింలు ప్రతి భాషనూ జ్ఞానం పొందే సాధనంగా చూశారు. ఇది మనకు నేటి భారతీయ, ప్రాపంచిక విద్యా వ్యవస్థలో చోటు చేసుకోవాల్సిన దృక్పథం.

## విద్యలో ముస్లింల వెనుకబాటు - కారణాలు

నేడు ముస్లింలలో చాలా మంది విద్యను సరిగా అర్థం చేసుకోలేదు. కొందరు పూర్తిగా ప్రాపంచిక విద్యనే సర్వస్వం అని భావిస్తుంటే, మరికొందరు ఆధ్యాత్మిక విద్య తప్ప మరొకటి అవసరం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. కొందరైతే మతపరమైన బోధనకు మితిమీరిన ప్రాధాన్యమిచ్చి, ప్రాపంచిక విద్యను ద్వేషిస్తున్నారు. విద్యా వ్యవస్థపై అపనమ్మకంతో అవగాహన లేక పిల్లల్ని మదర్సాలకే పరిమితం చేస్తున్నారు. ఇది ధర్మాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోవడం వల్ల కలుగుతున్న అనర్థం.

దైవ ప్రవక్త (స) హదీసులో: 'ముస్లిం అయిన ప్రతి స్త్రీ, ప్రతి పురుషునికీ విద్య అభ్యసించడం ఫర్జ్' అని స్పష్టంగా చెప్పారు. ఇది కేవలం మాతృభాషకో, మత విద్యకో పరిమితమైన ఆదేశం కాక అన్ని రకాల భాషలు, విద్యలకు వర్తిస్తుంది. జ్ఞాన సముపార్జన ఏ విధంగానైనా, ఏభాషలో అయినా చెయ్యాలన్నది స్పష్టమైన ఆదేశం.

## మదర్సాల్లో విద్యా సంస్కరణల అవసరం

బహుళ భాషలు, శాస్త్రీయ దృష్టికోణం, చరిత్ర అవగాహన, ఆధునిక పాఠ్యాంశాలు కూడా ధార్మిక పాఠశాలల్లో (మదర్సాల్లో) ప్రవేశపెట్టాలి. మదర్సాలు కేవలం అరబీ, ఉర్దూ, హిఫ్జ్ కే పరిమితం కాకుండా, ఆంగ్ల, తెలుగు భాషలు, గణితం, సైన్స్, కంప్యూటర్ విద్య, ఆర్థిక, సామాజిక విషయాలు సమస్తం నేర్పించాలి. నేటి పోటీ ప్రపంచంలో కావలసిన అన్ని నైపుణ్యాలు మదర్సా విద్యార్థులు పుణికి పుచ్చుకోవాలి. మన పూర్వీకుల మాదిరిగా పాఠశాల ప్రపంచ విజ్ఞానానికి ద్వారంగా మారాలి.

## డిజిటల్ యుగం -- ముస్లింలకు కొత్త అవకాశం

నేటి ఈ డిజిటల్ యుగంలో గూగుల్, యూట్యుబ్, ఈ-లైబ్రరీలు, ఓపెన్ సోర్స్ యూనివర్సిటీలు, ఏ ఐ సాధనాలు- ఇవన్నీ ముస్లింలకు అనంతమైన అవకాశాలను కల్పిస్తున్నాయి. కనీసం ఇంటర్నెట్ ఉపయోగాన్నయినా శాస్త్రీయంగా, విద్యా పరంగా మలచుకుంటే, అనేక సంవత్సరాల వెనుకడుగును కొద్ది సంవత్సరాల్లోనే అధిగమించవచ్చు.

విద్య మనకు ఇహలోకం, పరలోకం (దునియా, అఖిరత్) రెండింట్లోను మార్గదర్శిగా ఉంటుంది. చదువు లేకుండా ధర్మాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేం. విద్య, విజ్ఞానాలను నిర్లక్ష్యం చేయడమంటే మనం మన గురుతరమైన బాధ్యతనుండి పలాయనం చిత్తగించడమే. తత్సంబంధిత బాధ్యతను విస్మరించడమే. ఒక ముస్లిం సమాజంగా నేడు మన బాధ్యత విద్యను సముపార్జించడం ఒక్కటే కాదు, దాని ద్వారా సమాజానికి సరైన దారి చూపగలగాలి. అంధకారాన్ని పారద్రోలి వెలుగులు నింపగలగాలి. ఎందుకటే, ముస్లిం సమాజాన్ని ముందుకు నడిపించగల శక్తి విద్యే. ఇది కేవలం జమాఖర్చుల జ్ఞానం కాదు. జీవన తత్వం. అంధకారపు అజ్ఞానాన్ని దాటి, సజ్జనత, సచ్ఛీలత, సమర్థత వైపు మనల్ని నడిపించే విజ్ఞానం. మౌలానా మౌదూదీ లాంటి తాత్వికుల నుంచి మనం స్ఫూర్తిని పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందిప్పుడు. మన పాఠశాలలు, మదర్సాలు, కాలేజీలు, మన గృహాలు - ఇవన్నీ ఇల్మ్ పై ఆధారపడిన ఒక సంపూర్ణ సంస్కృతిగా మారితేనే ముస్లిం సమాజం మళ్ళీ తన చరిత్రాత్మక పాత్రను చక్కగా పోషించగలదు. కానీ సమస్య విద్య / ఇల్మ్ లేకపోవడంలో కాదు, దానికి తగిన దిశ లేకపోవడంలో ఉంది. విద్య అనేది కేవలం ఉపాధికి మార్గం కాదు, వ్యక్తిత్వ నిర్మాణానికి మూలం. విద్యను ధార్మికత, ఆచరణ, సామాజిక బాధ్యతలతో అనుసంధానించాలన్న దృక్పథం నేడు కరువైపోయింది. చదువుతో పాటు దాని దిశ, దాని నైతికత, దాని సేవా లక్ష్యం మరింత ప్రాముఖ్యంగా మారాలి. ఇలాంటి సమగ్ర దృక్పథం ఏర్పడినప్పుడే సమాజం పూర్వపు విద్యా వైభవాన్ని తిరిగి పునర్నిర్మించుకోగలదు. విద్య దైవాన్ని తెలుసుకునే మార్గమొక్కటే కాదు, సమాజాన్ని వెలుగులో నడిపించే శక్తి కూడా.! మళ్ళీ ఒకసారి ఆ వెలుగును దర్శించాలంటే, మనమంతా ఆత్మ విమర్శతో ముందుకు సాగాలి. విద్యా పరంగా ముందడుగు వెయ్యాలి. ఏమంటారు? ✤


పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# వర్షం... వరం

- ముహమ్మద్ వహీదుద్దీన్

ఈ విశ్వంలో అల్లాహ్ మనిషికి ప్రసాదించిన అనేక అనుగ్రహాలలో వర్షం ఒక గొప్ప వరం. ఎండిపోయిన భూమికి జీవం పోసేది వర్షమే. పచ్చని పంటలను పండించేది వర్షమే. దాహంతో ఉన్న జీవరాశు లకు నీటిని అందించేది వర్షమే. అందుకే వర్షం కేవలం ప్రకృతి సంఘటన కాదు, అది అల్లాహ్ యొక్క అపారమైన కరుణకు నిదర్శనం. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మేము ఆకాశం నుండి పవిత్రమైన నీటిని కురిపించాము." (అల్-ఫుర్ఖాన్ 25:48)

ఈ ఆయత్ మనకు వర్షం పవిత్రతను తెలియజేస్తుంది. వర్షపు ప్రతి చుక్కలో అల్లాహ్ కారుణ్యం దాగి ఉంది. మనిషి ఎంత శక్తివంతుడైనా ఒక వర్షపు చుక్కను కూడా సృష్టించలేడు. కాబట్టి వర్షం కురిసినప్పుడు మన హృదయాలలో కృతజ్ఞతా భావం కలగాలి.

## వర్షం- మరణించిన భూమికి జీవం

ఎండాకాలంలో భూమి ఎండిపోయి నిర్జీవంగా కనిపిస్తుంది. కానీ వర్షం కురిసిన వెంటనే అదే భూమి పచ్చదనంతో కళకళలాడుతుంది. దీనిని అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో పునరుత్థానానికి ఉదాహరణగా పేర్కొన్నాడు.

"(మీరు ప్రతి వర్షాకాలంలోనూ చూస్తారు), అల్లాహ్ ఆకాశం నుండి నీళ్లను కురిపించాడు. నిర్జీవంగా పడి ఉన్న భూమిలో ఒక్కసారిగా దాని ద్వారా ప్రాణం పోశాడు." (అన్-నహల్ 16:65)

ఈ దృశ్యం మనకు ఒక గొప్ప సందేశం ఇస్తుంది. ఎండిపోయిన భూమికి జీవం ఇచ్చిన అల్లాహ్, మరణించిన మనుష్యులను కూడా మళ్లీ లేపగలడు.

## వర్షం సమయంలో దుఆ స్వీకరించబడుతుంది

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "రెండు దుఆలు తిరస్కరించబడవు; అజాన్ సమయంలో చేసే దుఆ, వర్షం కురిసే సమయంలో చేసే దుఆ." (అబూ దావూద్)

అందువల్ల వర్షం పడుతున్నప్పుడు మనం చెడు పనులలో లేదా ఇతర పనులలో మునిగిపోకుండా ఉండాలి. అల్లాహ్‌ను స్మరించాలి. మన కుటుంబం, సమాజం, దేశం కోసం దుఆ చేయాలి.

వర్షం కురిసినప్పుడు దైవప్రవక్త ముహమ్మద్ ఈ దుఆ (వేడుకోలు) చదివేవారు:

"అల్లాహుమ్మ సయ్యిబన్ నాఫిఅన్"

అర్థం: "ఓ అల్లాహ్! ఈ వర్షాన్ని మాకు ప్రయోజనకరమైనదిగా చేయుము."

## మనసును కదిలించే కథ

ఒక గ్రామంలో అహ్మద్ అనే రైతు ఉండేవాడు. అతనికి చిన్న పొలం మాత్రమే ఉండేది. ఆ సంవత్సరం తీవ్రమైన కరువు వచ్చింది. నెలలు గడిచినా వర్షం కురియలేదు. పొలాలు ఎండిపోయాయి. ప్రజలు నిరాశలో మునిగిపోయారు.

ఒక రోజు గ్రామ మస్జిద్‌లో ఇమామ్ గారు అందరినీ పిలిచి, "మనమందరం అల్లాహ్ ముందు తౌబా (పశ్చాతాపం) చేసి వర్షం కోసం దుఆ చేద్దాం" అన్నారు.

మరుసటి రోజు గ్రామస్తులందరూ బహిరంగ ప్రదేశంలో కూడి నమాజ్-ఎ-ఇస్తిస్కా(వర్షం కోసం ప్రత్యేక ప్రార్థన) చేశారు. అందరూ కన్నీళ్లతో దుఆ చేశారు.

అక్కడికి ఒక చిన్న బాలుడు గొడుగు పట్టుకొని వచ్చాడు. అది చూసి ప్రజలు నవ్వారు. సూర్యుడు భగభగ మండుతున్నాడు. మేఘాలు వచ్చే అవకాశం కూడా లేదు.

"వర్షం పడే సూచనలు కూడా లేదు, ఇటువంటి సమయంలో నువ్వెందుకు గొడుగు తెచ్చావు?" అని అడిగారు.

ఆ బాలుడు అమాయకంగా చెప్పాడు:

"మనం అల్లాహ్‌ను వర్షం కోసం అడగడానికి వచ్చాం కదా! అల్లాహ్ తప్పకుండా వర్షం పంపుతాడని నమ్మాను. అందుకే గొడుగు తీసుకొచ్చాను."

ఆ బాలుడి విశ్వాసాన్ని చూసి అందరి కళ్లలో నీళ్లు వచ్చాయి. కొద్దిసేపటికి ఆకాశం మేఘాలతో నిండిపోయి భారీ వర్షం కురిసింది. ఈ కథ మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుంది. అల్లాహ్‌ను అడిగేట ప్పుడు సంపూర్ణ విశ్వాసంతో అడగాలి. నిజమైన ఈమాన్ (అల్లాహ్‌పై విశ్వాసం) ఉన్న హృదయం అల్లాహ్ కరుణపై ఎప్పుడూ నిరాశ చెందదు.

## వర్షం మనకు నేర్పే పాఠాలు

**1. కృతజ్ఞత :** వర్షం కురిసినప్పుడు "అల్హమ్దులిల్లాహ్" అని చెప్పాలి. ఎందుకంటే అది అల్లాహ్ అనుగ్రహం.

**2. సహనం :** కరువు వచ్చినప్పుడు నిరాశ చెందకుండా అల్లాహ్‌పై నమ్మకం ఉంచాలి.

**3. దానం :** వర్షం వల్ల పంటలు బాగా పండినప్పుడు పేదలకు సహాయం చేయాలి.


**4. తౌబా :** ప్రకృతి విపత్తులు మన పాపాలను గుర్తు చేస్తాయి. అల్లాహ్ వైపు తిరిగి రావాలి.

## ముగింపు

వర్షం కేవలం నీరు కాదు; అది అల్లాహ్ ప్రేమకు, కరుణకు, శక్తికి ఒక గొప్ప నిదర్శనం. ప్రతి వర్షపు చుక్క మనకు అల్లాహ్‌ను గుర్తు చేస్తుంది. ఆకాశం నుండి పడే నీటి బిందువులు మన హృదయాలను కూడా పవిత్రం చేయాలి. వర్షం కురిసినప్పుడు అల్లాహ్‌ను స్మరిద్దాం, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుదాం, మన జీవితాలను సత్కార్యాలతో అలంకరించుకుందాం.

"వర్షపు ప్రతి చుక్కలో అల్లాహ్ కరుణ దాగి ఉంది; దానిని కళ్లతో చూసేవారు చాలామంది ఉంటారు, కానీ హృదయంతో అనుభవించే వారే నిజమైన విశ్వాసులు."

అల్లాహ్ మనందరినీ తన అనుగ్రహాలకు కృతజ్ఞత చూపే వారిగా, వర్షం వంటి తన కరుణలను సద్వినియోగం చేసుకునే వారిగా చేయుగాక. ఆమీన్.




**ప్రతి ఉదయం** మీ ముందు రెండు మార్గాలను ఉంచుతుంది. అందులో మొదటిది: నిన్నటి అసంపూర్ణ ఆలోచనలతో, అసంపూర్ణ పనులతోనే కాలం గడుపుతూ అలాగే నిద్రపోవడం, లేదా వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నించడం. రెండవది: ఇప్పటి వరకు చేసింది చాలు, ఇక ఈ రోజు నుండి కొత్తగా ఆలోచించడం ప్రారంభించడం.

మీరు మారనంత వరకు మీ జీవితం మారదు, మీ పరిస్థితులూ మారవు. మీరు ఎప్పుడైతే మారాలని గట్టిగా నిర్ణయించుకుంటారో, అప్పుడు పరిస్థితులు కూడా మీకు అనుకూలంగా మారడం మొదలవుతాయి. జీవితంలో మార్పు వచ్చినప్పుడు మీ ఆలోచనల్లో కూడా స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. ఎవరైతే ఆలోచించగలరో, వారే సాధించగలరు. ఆలోచనలు ఉండి కూడా ఆచరణలో పెట్టనివారు, తమ జీవితంలో ఆశించిన ముందడుగు ఎప్పటికీ వేయలేరు. ఈ తేడాలన్నీ కేవలం ఆలోచనల వల్లే వస్తాయి.

చాలా మంది అదృష్టం తమ తలుపు తట్టడం లేదని బాధపడుతుంటారు. తమ కళ్ళ ముందే ఎవరైనా ఎదుగుతుంటే... "వారి కర్మ, వారి రాత అలా ఉంది" అని సరిపెట్టుకుంటారు. కానీ, ఆ కర్మలు తమ చేతల ద్వారానే మారుతాయనే నిజాన్ని గ్రహించరు. ఉదాహరణకు, మీకు ఆకలి వేసినప్పుడు, ఆకలితో ఉన్న పొట్టను ఆహారంతో నింపి సంతృప్తి పరచకుండా... "నా కర్మ ఇంతే" అని కూర్చోవడం అవివేకం కాదా? వేప మొక్కను నాటి, మామిడి పండును ఆశించి, అంతా కర్మకే వదిలేస్తే ఆశించిన ఫలితం దక్కుతుందా? ఆలోచించండి.

## ఆలోచనల స్పష్టతే విజయానికి మార్గం

మనల్ని వరించడానికి ముందే అదృష్టం మన ఆలోచనల రూపంలో వస్తుందని ఎవరూ గమనించరు. ఒకవేళ మీ ఆలోచనల్లో స్పష్టత ఉంటే, మార్గాలు తమంతట తామే మీ కళ్ళ ముందు ప్రత్యక్షమవుతాయి. మీ ఆలోచనల్లో ఆత్మవిశ్వాసం ఉంటే, భయం తనంతట తానే వెనకడుగు వేస్తుంది. మీ ఆలోచనల్లో సానుకూల దృక్పథం (Positive attitude) ఉంటే, ఫలితం కూడా మీకు అనుకూలంగానే ఉంటుంది. మీ మెదడు ఒక వ్యవసాయ క్షేత్రం లాంటిది. ఆ క్షేత్రంలో మీరు ఏ విత్తనాలు నాటుతారో, ఆ ఫలాలను మాత్రమే పొందుతారు, ఆస్వాదిస్తారు.

మిమ్మల్ని మీరు బలహీనులుగా భావిస్తే, ఈ ప్రపంచం, సమాజం కూడా మిమ్మల్ని అలాగే గుర్తిస్తుంది. కానీ, మీ ఆలోచనల్లో మీరు సమర్థులని భావించి, మీ ఆత్మవిశ్వాసాన్ని సంపూర్ణంగా నమ్మితే... మీరు ఏదైనా చేయగలరు, విజయం సాధించగలరు. "నేను గెలవడానికే పుట్టాను, మరి ఎందుకు ఆగిపోతున్నాను?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకుంటే, కచ్చితంగా ఏదో ఒక విజయ ద్వారం మీ కోసం తెరుచుకుంటుంది. కాబట్టి ఉదాసీనంగా ఉండకండి. 'మీ కలలకు మీరే సంపూర్ణ బాధ్యులు, అలాగే అర్హులు కూడా'. మీ అదృష్టాన్ని ఎవరో వచ్చి బయట దాచిపెట్టలేదు; అది మీ మెదడులోనే తిష్ఠ వేసుకుని కూర్చొని ఉంది. ఏ రోజైతే మీరు మీ ఆలోచనలను మార్చుకోవాలని నిశ్చయించుకుంటారో, ఆ రోజు నుంచే మీ 'అదృష్టం' మీ వైపు మలుపు తిరుగుతుంది.

భవిష్యత్తు అనేది ప్రతిదినం, ప్రతిక్షణం రూపుదిద్దుకుంటుంది. భవిష్యత్తు అంటే మరేదో కాదు... నేడు మీరు తీసుకునే

నిర్ణయాలు, మీరు చేసే కర్మల ఫలాలే. మీరు మంచి మొక్కను నాటితే అది తీపి ఫలాలను ఇస్తుంది, విష బీజాలను నాటితే విషపూరితమైన ఫలాలనే ఇస్తుంది. అంటే ఈ రోజు మీరు ఎలా ఉంటారో, అది మీ రేపటిని ప్రతిఫలిస్తుంది. "రేపు అనేది ఈ రోజు కన్నా ఇంకాస్త మెరుగ్గా ఉంటుంది" అని ఆశించాలి. ఒకవేళ ఈ రోజును మీరు చెడు ఆలోచనలతో వృథా చేస్తే, దాని ప్రభావం కచ్చితంగా రేపటిపై ఉంటుంది. ఈ రోజు మీరు తీసుకునే నిర్ణయాలు సరైనవైతే, భవిష్యత్తులో తప్పకుండా సంతోషాన్ని పొందుతారు.

## ఈ సందర్భంగా మీకోసం ఒక చిన్న కథ...

ఒక సీతాకోకచిలుక తన గూడు (కోశస్థ దశ) నుండి బయటకు రావడానికి ప్రయత్నిస్తోంది. ఆ క్రమంలో ఒక యువకుడి దృష్టి దానిపై పడింది. ఆ గూడులోంచి దాని రెక్కలు సగం బయటకు కనిపిస్తున్నాయి, మిగతా శరీరం లోపలే ఉండిపోయింది. అది పడుతున్న శ్రమను చూసి జాలిపడిన ఆ యువకుడు, ఒక కత్తెరను తీసుకొని ఆ గూడును కత్తిరించాడు. దాంతో సీతాకోకచిలుక సులువుగా బయటకైతే వచ్చింది కానీ, దాని శరీరం మొత్తం ఉబ్బిపోయినట్లుగా ఉండి, రెక్కలు పూర్తిగా విచ్చుకోలేదు. ఫలితంగా అది గాలిలో స్వేచ్ఛగా ఎగరలేక, భూమిపైనే పాకడం మొదలుపెట్టింది.

ఎందుకంటే, సీతాకోకచిలుక ప్రకృతిసిద్ధంగా తనను తాను ఆవిష్కరించుకునే క్రమంలో ఆ గూడు నుండి బయటకు రావడానికి తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. ఆ సంఘర్షణ వల్లనే దాని రెక్కలకు బలం చేకూరుతుంది. కానీ ఆ యువకుడు పరిపక్వం చెందకముందే సహాయం పేరిట చేసిన 'బల ప్రయోగం' (Forced) వల్ల, అది ఆ సామర్థ్యాన్ని కోల్పోయింది. ఒకవేళ అది స్వయంగా సంఘర్షించి ఉంటే, శరీరం పూర్తిగా పరిపక్వమై, బయటకు వచ్చి స్వేచ్ఛగా గగనంలో విహరించేది. కానీ అలా జరగలేదు. ఫలితంగా అది అసంపూర్ణ రూపంలో మిగిలిపోయి ఎగిరే శక్తినే కోల్పోయింది. ఆ యువకుడు అప్రయత్నంగా దాని స్వేచ్ఛను హరించాడు.

## నేటి యువత - ఆచరణ

ఈ కథ మనకు ఏం తెలియజేస్తుందంటే... నేడు చాలా మంది యువకులు ఉన్నత చదువులు చదవాలని, ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉద్యోగాలు సాధించాలని అనుకుంటున్నారు. కానీ ఎలాంటి సంఘర్షణ లేకుండా, కనీస ప్రయత్నం (Academic efforts) చేయకుండానే పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని ఆశిస్తున్నారు. ఒక్క రోజు కూడా పుస్తకం తిరగేయకుండా ఉద్యోగం రావాలని, సర్టిఫికెట్ మరియు నైపుణ్యం లేకుండానే ఉన్నత స్థానాలకు వెళ్లాలని కలలుగంటున్నారు.

మరికొందరైతే ఏదైనా మ్యాజిక్ ద్వారానో, లేదా అడ్డదారుల్లో (డబ్బులు ఇచ్చి మేనేజ్ చేయడం ద్వారా) సెటిల్ కావాలని దురాశతో ఆలోచిస్తున్నారు. పరీక్ష గదుల్లో చాలా మంది విద్యార్థులు కాపీయింగ్ చేస్తూ పరీక్షలు పాస్ కావాలని చూస్తుంటారు. కానీ, ఆ కాపీ కొట్టడానికి పెట్టే శ్రద్ధను, సమయాన్ని పుస్తకాలపై పెట్టి చదువుకుంటే కచ్చితంగా సొంత తెలివితోనే పాస్ అవ్వచ్చనే నిజాన్ని గ్రహించలేకపోవడం వారి అజ్ఞానం.

తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పినట్లు చేయడం ఒకెత్తయితే, నిజ జీవితానికి, పుస్తకాల్లోని అభ్యాసాలకి చాలా తేడా ఉంటుందని బయటకు వచ్చాక కూడా తెలుసుకోలేకపోవడం అమాయకత్వం. ఉద్యోగాల ఎంపిక అనేది అడ్డదారుల్లో (Short-cuts) జరగదు. దానికి ఒక పద్ధతి ఉంటుంది. ఉదాహరణకు సివిల్స్ తీసుకుంటే... ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఇలా మూడు దశల్లో వడపోత ఉంటుంది. ఈ మూడు దశల్లో ప్రతిభ కనబరిచిన వారికే ఉద్యోగం వరిస్తుంది. అంతేకానీ చూచిరాతలను, కాపీయింగ్‌లను నమ్ముకుంటే కుదరదు కదా!

అలాగే మీరు ఐఐటీ లేదా మరేదైనా ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసి ఉండవచ్చు. కేవలం సర్టిఫికెట్ ఉన్నంత మాత్రాన ఎవరూ ఉద్యోగం ఇవ్వరు. ఉద్యోగానికి కావలసిన కనీస పరిజ్ఞానం (Minimum knowledge), ప్రాథమిక నైపుణ్యాలు (Basic skills), నాయకత్వ లక్షణాలు (Leadership qualities), జీవన నైపుణ్యాలు (Life skills), మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ (Communication skills) పెంపొందించుకోకపోతే ఉద్యోగం ఎలా వస్తుందో ఒక్కసారి ఆలోచించండి.

కాబట్టి, మీ ఆలోచనలను మార్చుకోండి; అప్పుడు అదృష్టం కూడా మీకు దాసోహమవుతుంది. ఆ మార్పు మీ ఆలోచనలు మారిన క్షణం నుంచే మొదలవుతుంది. అందుకే...

"అసంపూర్ణమైన ఆలోచనలు, అసంపూర్ణమైన ప్రయత్నాలు... ఎప్పుడూ అసంపూర్ణమైన ఫలితాలనే ఇస్తాయి!" ✤

వ్యక్తి సంస్కార,
సంఘ నిర్మాణ,
నైతిక పథకం
గీటురాయి
వారపత్రిక

# నేను భారతీయుడిని... ద్వేషానికి నదీం సమాధానం!

ముహమ్మద్ అజీజుద్దీన్



హైదరాబాద్ నగరానికి ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ మహానగరం కేవలం చార్మినార్, బిర్యానీ వంటి చారిత్రక, సాంస్కృతిక వారసత్వాలకే పరిమితం కాలేదు. శతాబ్దాలుగా ఇక్కడ విలసిల్లుతున్న హిందూ–ముస్లిం సోదరభావానికి, గంగా–జమునా తహజీబ్‌కు ఇది సజీవ ప్రతీక. మతం, భాష, కులం వంటి విభేదాలకు అతీతంగా ప్రజలు సౌభ్రాతృత్వంతో కలిసి జీవించడమే హైదరాబాద్ సంస్కృతికి మూలస్తంభం. ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకుంటూ, కష్టసుఖాల్లో పరస్పరం అండగా నిలవడం ఈ నగర విశిష్టత. అలాంటి సామరస్య వాతావరణానికి భంగం కలిగించే సంఘటనలు చోటుచేసుకోవడం ప్రతి భారతీయుడిని తీవ్రంగా కలవరపరిచే అంశం.

ఇటీవల కాప్రాలోని జనప్రియ లేక్ ఫ్రంట్ సొసైటీలో ఒక ముస్లిం కుటుంబాన్ని "మీరు పాకిస్తానీలు" అంటూ అవమానించడం అత్యంత విచారకరం. భారతదేశ పౌరులను వారి మతం ఆధారంగా విదేశీయులుగా ముద్ర వేయడం కేవలం వ్యక్తిగత అపహాస్యం మాత్రమే కాదు; భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వం, లౌకికత్వం, సౌభ్రాతృత్వం వంటి ఉదాత్త విలువలకు పూర్తిగా విరుద్ధం. ఎవరి దేశభక్తినైనా వారి మతం ఆధారంగా ప్రశ్నించడం సమాజంలో అనవసర విద్వేషాలను, విభజనను పెంచే ప్రమాదకర ధోరణి.

గత కొంతకాలంగా దేశంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది. చిన్న చిన్న వివాదాలకు మతరంగు పులిమి ప్రజల మధ్య అనుమానాలు, వైషమ్యాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొంతమంది వ్యక్తులు లేదా శక్తులు సమాజంలో శాంతి భద్రతలను, సామరస్యాన్ని దెబ్బ తీసేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ మతాల మధ్య విబేధాలు సృష్టించాలని చూడటం

ఆందోళనకరం. ఇలాంటి ధోరణులు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, మొత్తం సామాజిక సమతుల్యతను దెబ్బతీస్తాయి. ద్వేషాన్ని వ్యాప్తి చేయడం సులభమే కావచ్చు, కానీ దశాబ్దాలుగా నిర్మించుకున్న పరస్పర విశ్వాసాన్ని కాపాడుకోవడం ఎంతో శ్రమతో కూడుకున్న పని.

ఈ నేపథ్యంలో, జనప్రియ లేక్ ఫ్రంట్ సొసైటీ ఘటనలో బాధితుడు నదీం ప్రదర్శించిన ధైర్యం, నిబ్బరం అభినందనీయం. "నేను సగర్వంగా భారతీయుడిని. నా తాతగారు భారత సైన్యంలో సేవలందించారు" అని ఆయన నినదించడం ప్రతి భారతీయుడికి గర్వకారణం. దేశభక్తికి మతంతో సంబంధం లేదని, భారతదేశం ప్రతి పౌరుడి మాతృభూమి అని ఆయన మాటలు పునరుద్ఘాటించాయి. భారత సైన్యంలో అన్ని మతాలకు చెందిన వేలాది మంది సైనికులు దేశ సార్వభౌమాధికారం కోసం తమ ప్రాణాలను అర్పించారు. వారి త్యాగాలకు మత ప్రమేయంలేదు; దేశం కోసం వారు చేసిన అజేయమైన సేవే వారికి లభించిన నిజమైన గుర్తింపు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను ప్రసాదించింది. భారతదేశంలో నివసించే ప్రతి వ్యక్తి, ఏ మతానికి చెందినవారైనా సరే, సమాన గౌరవాన్ని, చట్టపరమైన రక్షణను పొందే సంపూర్ణ హక్కును కలిగి ఉన్నారు. ఒక పౌరుడిని "పాకిస్తానీ" అని నిందించడం కేవలం ఆవేశంలో అన్న మాటగా కొట్టిపారేయలేము. అలాంటి వ్యాఖ్యలు వ్యక్తిగత ఆత్మగౌరవాన్ని క్షోభకు గురిచేయడమే కాకుండా, సామాజిక సమగ్రతను సైతం దెబ్బతీస్తాయి. అందుకే ఇలాంటి సంఘటనలను చులకనగా చూడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

హైదరాబాద్ నగరం చరిత్రలో ఎన్నో సవాళ్లను, పరీక్షలను ఎదుర్కొన్నప్పటికీ తన గంగా - జమునా తహజీబ్‌ను ఎప్పటికప్పుడు సగర్వంగా కాపాడుకుంటూ వచ్చింది. ఇక్కడి ప్రజలు ఎల్లప్పుడూ శాంతిని, పరస్పర గౌరవాన్ని అత్యంత విలువైన సంపదగా భావించారు. ఈ మహోన్నత సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఎవరు ప్రయత్నించినా సమాజం అప్రమత్తంగా ఉండాలి. మనం మతాల మధ్య గోడలు నిర్మించడం కాదు, మనసుల మధ్య వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉంది. విద్వేషాన్ని వ్యాప్తి చేసే మాటల కంటే ప్రేమ, గౌరవం, సహనం మాత్రమే సమాజాన్ని మరింత బలోపేతం చేయగలవు.

అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థ కూడా ఇలాంటి సంఘటనలపై అత్యంత బాధ్యతాయుతంగా, త్వరితగతిన స్పందించాలి. జనప్రియ లేక్ ఫ్రంట్ సొసైటీలో ఒక భారతీయ పౌరుడిని అకారణంగా నిందించి, అవమానించిన వ్యక్తిపై చట్టపరంగా సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమే అనే సందేశం సమాజంలోకి బలంగా వెళ్లాలి. ఒక ఘటనపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పుడే, భవిష్యత్తులో ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడానికి ఎవరైనా వెనుకాడతారు. ఇది ప్రతీకారం కోసం కాదు, సమాజంలో శాంతిని, పరస్పర గౌరవాన్ని నిలబెట్టడానికి అనివార్యమైన చర్య.

ముగింపుగా, మనమంతా గుర్తుంచుకోవాల్సిన పరమసత్యం ఒక్కటే: భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి సమున్నత ప్రతీక. ఇక్కడ ప్రతి మతానికి, ప్రతి సంస్కృతికి, ప్రతి పౌరుడికి సమాన స్థానం, గౌరవం ఉన్నాయి. ఒకరిని వారి మతం ఆధారంగా తక్కువ చేసి మాట్లాడటం అంటే భారత రాజ్యాంగ స్ఫూర్తిని, ఆశయాలను అవమానించడమే. హైదరాబాద్ నగరం యొక్క గంగా - జమునా తహజీబ్‌ను కాపాడుకోవడం మనందరి ఉమ్మడి బాధ్యత.

విద్వేషానికి కాదు విశ్వాసానికి, విభజనకు కాదు ఐక్యతకు, ద్వేషానికి కాదు మానవత్వానికి మనం అండగా నిలిచినప్పుడే మన సమాజం మరింత సుదృఢమవుతుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. చట్టం తన పని తాను నిష్పక్షపాతంగా చేయాలి. మన సమాజం శాంతి, సామరస్యం, సోదరభావాల బాటలో ప్రగతి పథం వైపు సాగాలి. ✤

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



- షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల

# నిస్సహాయ మానవుడు... అంతుచిక్కని విశ్వం

సాంకేతికంగా మనిషి ఎంతో ఎదిగాడు. అంతరిక్షంలో అడుగు పెట్టాడు, గ్రహాంతరాల్లోకి నౌకలను పంపాడు, కృత్రిమ మేధస్సు (AI)తో తానే ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నానని విర్రవీగుతు న్నాడు. కానీ, యుగాలు గడిచినా మానవ మేధస్సుకు అందని, దైవదూతలకు సైతం ఎరుకలేని కొన్ని అగోచర సత్యాలు ఈ అనంత విశ్వంలో దాగి ఉన్నాయి.

దివ్య ఖుర్‌ఆన్ సూచించిన ఆ ఐదు మహా రహస్యాల ముందు మానవ విజ్ఞానం ఎంత అల్పమైనదో, మన గర్వం ఎంతటి నీటిబుడగో చాటిచెప్పే ఆధ్యాత్మిక, యథార్థ విశ్లేషణ ఇది.

## 1. ప్రళయం: కాలగర్భంలో దాగిన ఆఖరి ఘడియ

"ఆ అంతిమ ఘడియ ఎప్పుడు వస్తుంది?" అనేది శతాబ్దాలుగా మానవాళిని వేధిస్తున్న ప్రశ్న.

వాతావరణ మార్పులు, గ్రహాల గమనాలు చూసి శాస్త్రవేత్తలు యుగాంతంపై ఎన్నో అంచనాలు వేస్తున్నారు. కానీ, ఆ కాలజ్ఞానం కేవలం సృష్టికర్త వద్దే ఉంది. చంద్రుడు కాంతిహీనమై, సూర్య చంద్రులు కలిసిపోయి, నక్షత్రాలు రాలిపడి, సముద్రాలు బద్దలయ్యే ఆ మహా ప్రళయం ఎప్పుడు వస్తుందో శంఖం (సూర్) పూదే దైవదూతకు సైతం తెలియదు. ఏ సూపర్ కంప్యూటరో, ఏ శాస్త్ర సూత్రమో ఆ ఆఖరి క్షణాన్ని ఇతమిత్థంగా ప్రకటించ లేదు, ప్రకటించలేదు కూడా.

**ఆ గడియకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్ వద్ద మాత్రమే ఉన్నది. ఆయనే వర్షాన్ని కురిపిస్తాడు, తల్లుల గర్భాలలో పెరుగుతున్నదేమిటో ఆయనే ఎరుగును.** (దివ్య ఖుర్‌ఆన్ 31:34)

## 2. వర్షం : అంచనాలకు అందని దైవ కారుణ్యం

ఉపగ్రహాలు ఉన్నాయి, రాడార్లు ఉన్నాయి... కానీ నేటికీ వాతావరణ శాస్త్రం వర్షాన్ని నూటికి నూరు శాతం ఖచ్చితత్వంతో అంచనా వేయలేకపోతోంది.

ఒకే ఊరిలో ఒక వీధిలో ఎండ కాస్తూ, మరో వీధిలో జలపాతంలా వర్షం కురిసే విచిత్రాలు మనం చూస్తూనే ఉంటాం. మేఘాలను దట్టంగా మలిచి, ఎండిపోయిన భూమికి ప్రాణం పోసే ఆ పరిశు ద్ధ జలం పూర్తిగా దైవాజ్ఞతోనే కురుస్తుంది. లీటర్ల కొద్దీ నీటిని

ల్యాబ్‌లో తయారు చేయగలరేమో కానీ, కరువుతో అలమటించే భూమిపై మేఘాలను శాసించి వర్షం కురిపించడం ఏ మానవ నియంత్రణకూ సాధ్యం కాని పరమ రహస్యం.

‘‘అల్లాహ్ మేఘాన్ని మెల్లమెల్లగా నడపటాన్ని, దాని తునకలను ఒకదానితో ఒకటి కలపటాన్ని, తరువాత దానిని పోగుచేసి ఒక దట్టమైన మబ్బుగా మలచటాన్ని నీవు చూడవా? తరువాత దాని పైపొర నుండి వర్షపు చినుకులు రాలుతూ ఉండటాన్ని నీవు చూస్తావు.’’(దివ్య ఖుర్ఆన్ 24: 43)

‘‘తన కారుణ్యానికి ముందు గాలులను శుభవార్తలుగా చేసి పంపేవాడు ఆయనే. తరువాత ఆకాశం నుండి పరిశుద్ధ జలాన్ని అవతరింపజేస్తాడు.(దివ్య ఖుర్ఆన్ 25:48)

‘‘ఇవి పుష్కలంగా మాకు వర్షాన్ని కురిపించే మేఘాలు.’’(దివ్య ఖుర్ఆన్ 46:24)

## 3. గర్భ రహస్యం: కేవలం లింగ నిర్ధారణేనా?

ఆధునిక వైద్యం తల్లి గర్భంలో ఉన్నది ఆడో, మగో చెప్పగలుగు తుందేమో... కానీ ఆ శిశువు తలరాతను మార్చగలదా?

సంతానం అనేది ఒక అద్భుత దైవిక బహుమానం. కొందరికి ఇవ్వడం, కొందరికి ఇవ్వకపోవడం, మరికొందరికి కేవలం ఆడపిల్లలను లేదా మగపిల్లలను ఇవ్వడం పూర్తిగా ఆ విధాత నిర్ణయం. గర్భ రహస్యం కేవలం జీవశాస్త్రం కాదు, అది ఒక సృష్టి అద్భుతం.

‘‘మేము మానవునికి, అతను తన తల్లిదండ్రుల పట్ల ఉదార భావంతో మెలగాలని ఉపదేశించాము. అతని తల్లి అతనిని ఎంతో శ్రమతో తన గర్భంలో పెట్టుకొని మోసింది, ఎంతో ప్రేమతోనే అతనిని కన్నది.’’ (దివ్య ఖుర్ఆన్ 46:15).

## 4. ఉపాధి (రిజ్ఖ్): ఎవరి కూడు ఎక్కడో..!

‘‘భూమిపై తిరుగాడే ప్రతి ప్రాణి జీవనోపాధి అల్లాహ్ బాధ్యతే’’ అంటుంది ఖుర్ఆన్.

మనం రేపు ఏం సంపాదించబోతున్నామో, ఏ దేశంలో, ఏ మట్టిపై నిలబడి తింటామో మనకు తెలియదు. కోట్ల ఆస్తులున్నా నోట్లోకి మెతుకు వెళ్లని పరిస్థితి కొందరిదైతే, రూపాయి లేకపోయినా రాజభోగం అనుభవించే స్థితి మరికొందరిది. పక్షులు ఏనాడూ దాచుకోవు, రేపటి గురించి చింతించవు. ఉదయం ఖాళీ కడుపుతో రెక్కలు విప్పి ఎగిరిపోతాయి, సాయంత్రానికి కడుపు నింపుకుని గూటికి చేరుతాయి. ఈ విశ్వంలో జీవనోపాధి పంపిణీ వ్యవస్థ కేవలం ఆ సృష్టికర్త చేతుల్లోనే ఉంది.

‘‘.....నీవు కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తావు. (దివ్య ఖుర్ఆన్ 3:27)

‘‘ధరణిపై సంచరించే ఏ ప్రాణి ఉపాధి అయినా అల్లాహ్ బాధ్యతలో లేకుండా లేదు. ఆ ప్రాణి ఎక్కడ నివసిస్తుందో అది ఎక్కడకు చేర్చబడనున్నదో ఆయనకు తెలియకుండా లేవు. సమస్తమూ ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాయబడి ఉన్నది.(దివ్య ఖుర్ఆన్ 11:6)

## 5. మరణం: అంతిమ సత్యం

పుట్టిన ప్రతి ప్రాణి మరణించక తప్పదు. సైన్స్ ఆయుష్షును పెంచే ప్రయత్నం చేయవచ్చు కానీ, చావును ఆపలేదు.

చుట్టూ వందల మంది నిపుణులైన వైద్యులను పెట్టుకుని, కోట్లాది రూపాయలు కుమ్మరించినా మరణ ఘడియ రాగానే శ్వాస ఆగిపోవడం మనం నిత్యం చూస్తూనే ఉంటాం. మరణ దూత వచ్చినప్పుడు ఏ అధికారమూ, ఏ ఐశ్వర్యమూ అడ్డుపడలేదు. మరణం ఎప్పుడు, ఎక్కడ, ఏ క్షణంలో సంభవిస్తుందో రాసిపెట్టిన వాడు ఆ సృష్టికర్త ఒక్కడే.

‘‘ప్రతి ప్రాణి మృత్యువును తప్పకుండా చవి చూస్తుంది’’ (దివ్య ఖుర్ఆన్ 21:35)

‘‘...చివరకు ప్రతి మనిషి మరణిస్తాడు.(3:185)

## ప్రళయం, వర్షం, గర్భ రహస్యం, ఉపాధి, మరణం...

ఈ ఐదూ మానవ మేధస్సుకు ఎప్పటికీ అంతుచిక్కని దైవిక రహస్యాలు. సైన్స్ ఎంత పురోగమించినా సృష్టికర్త గీసిన గీతను దాటలేదనడానికి ఇవే సజీవ సాక్ష్యాలు. ల్యాబ్‌లలో జీవాన్ని సృష్టించలేము, మరణాన్ని ఆపలేము. ఈ సత్యాన్ని గ్రహించినప్పుడే మానవుడిలోని అహంకారం కరిగిపోతుంది. తాను కేవలం ఒక సృష్టిననే నిజాన్ని ఒప్పుకుంటూ, పరమ సత్యమైన ఆ సృష్టికర్త ముందు మోకరిల్లుతాడు.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

*అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో*

**తఫ్హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**29 ఆయత్‌లు** **మదీనా అవతరణ**

# 48. అల్ ఫత్హ్

18 – 21 అల్లాహ్ విశ్వాసుల పట్ల ప్రసన్నుడయ్యాడు, వారు చెట్టు క్రింద నీతో ప్రమాణం చేస్తూ ఉన్నప్పుడు.[32] వారి హృదయాల స్థితి ఆయనకు తెలుసు, అందువల్ల ఆయన వారికి ప్రశాంతతను అవతరింపజేశాడు.[33] వారికి బహుమానంగా సమీప విజయాన్ని అనుగ్రహించాడు,

**(32వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

అల్లాహ్, ఆయన సందేశహరుడు, ఆయన ధర్మం కొరకు వీరి చిత్తశుద్ధి, ప్రేమలలో ఏమాత్రం కొరత ఉన్నా ఈ అత్యంత ప్రమాదకరమయిన సందర్భంలో దైవ సందేశహరుని తోడు వదలివెళ్ళిపోయేవారు, ఇస్లామ్ మాట శాశ్వతంగా అంతమయి పోయేది. స్వయంగా తమ చిత్తశుద్ధి, ప్రేమ కారణంగానే వారు ఈ బయ్‌త్‌లో పాల్గొనేందుకు వివశులయ్యారు, అంతే తప్ప వారిపైన ఎటువంటి బాహ్యపరమయిన ఒత్తిడి లేకపోయింది, దాని కారణంగా వారు అందులో పాల్గొన్నా రనడానికి. వారు ఆ సమయంలో దైవధర్మం కొరకు చంప డానికీ చావడానికీ సమాయత్తమవడం అన్నది, వారు తమ విశ్వాసంలో సత్యవంతులు, స్థిరచిత్తులు, దైవం, దైవ ప్రవక్తల ఎడల విశ్వసనీయతలో పతాక స్థాయి పరిపూర్ణత పొంది ఉన్నారు అనడానికి ప్రస్ఫుటమయిన నిదర్శనం. ఈ కారణంగానే అల్లాహ్ వారికి తన ప్రసన్నతా ప్రమాణపత్రం ప్రసాదించాడు. అల్లాహ్ పక్షాన ప్రసన్నతా ప్రమాణం ప్రాప్త మయిన తరువాత, ఎవరయినా వారి ఎడల అయిష్టతను కనబరచినా వారిపైన వ్యంగ్యోక్తులు విసిరినా అదంతా వారి యెడల కాదు, అల్లాహ్ యెడల చేసినట్లవుతుంది. దీనిమీద కొందరు, 'ఈ మహాశయులకు ఈ ప్రసన్నతా పత్రం అనుగ్ర హించిన సమయంలోనయితే వీరు చిత్తశుద్ధితోనే ఉన్నారు, కాని ఆ తరువాత వారు దైవానికీ, దైవసందేశహరునికీ ద్రోహు లయిపోయారు' అని అంటారు. ఇటువంటి వారు బహుశా దైవం పట్ల అపోహలో పడిపోయారు! ఆయనకు ఈ ఆయత్ అవతరింపజేస్తున్నప్పుడు ప్రవక్త సహచరుల భవిష్యత్తును గురించి ఏమీ తెలియదు కాబోలు, అందువల్ల కేవలం ఆ సమయంలో పరిస్థితి చూసి ఆయన ఈ ప్రమాణపత్రం ప్రసా దించాడు. బహుశా ఇలా తెలియని పరిస్థితి కారణంగానే దాన్ని తన పరిశుద్ధ గ్రంథంలోనూ పొందుపరిచాడు– ఆ తరువాత వీరు విద్రోహులయి పోయినప్పటికీ ప్రపంచం వారిని గురించి ఈ ఆయత్ చదువుతూ, దైవం మన్నించుగాక, ఈ విద్రోహులకు ఇటువంటి ప్రసన్నతా పత్రం ప్రసాదించిన దైవానికున్న అగోచర విషయ జ్ఞానం పట్లనూ ప్రశంసిస్తూ ఉండాలని!

ఏ చెట్టు క్రింద ఈ బయ్‌త్ జరిగిందో దాన్ని గురించి హజ్రత్ నాఫె మౌలా ఇబ్ను ఉమర్ ఉల్లేఖించిన ఈ విషయం సాధార ణంగా ప్రతీతి పొందింది. జనులు దాని వద్దకు పోయి తరచుగా నమాజ్ చేసేవారనీ, ఆ తరువాత హజ్రత్ ఉమర్(ర) ఈ విషయం తెలిసినప్పుడు ఆయన జనులను మందలించా రని ఆపైన ఆ చెట్టును నరికించారని ఉంది (తబ్‌కాత్ ఇబ్ను సఅద్: సం.2, పు.100). కాని అనేక ఉల్లేఖనాలు దానికి విరుద్ధంగానూ ఉన్నాయి. ఒక ఉల్లేఖనం స్వయాన హజ్రత్ నాఫె చెప్పినదే తబ్‌కాత్ ఇబ్ను సఅద్‌లోనే ఉటంకించబడింది. బయ్‌తురిజ్వాన్ జరిగిన అనేక సంవత్సరాల తరువాత సహచర మహనీయులు ఆ చెట్టును వెదికారు కాని దాన్ని గుర్తుపట్టలేకపోయారు. అది ఏ చెట్టో అన్న విషయంలో భేదాభి ప్రాయం ఏర్పడింది (పు.105). రెండవ ఉల్లేఖనం బుఖారీ, ముస్లిమ్, తబ్‌కాత్ ఇబ్ను సఅద్‌లో హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యబ్ ఉల్లేఖించింది. ఆయన ఇలా అన్నారు, 'మా నాన్న బయ్‌తురిజ్వాన్‌లో పాల్గొన్నారు. ఆయన నాకు చెప్పారు, 'మరుసటి సంవత్సరం కజా ఉమ్రా చెయ్యడానికి వెళ్ళినప్పుడు మేము ఆ చెట్టు ఏదో మరచిపోయాము. బాగా వెదికినప్పటికీ మేము దాన్ని గుర్తించలేకపోయాము' అని. మూడవ ఉల్లేఖనం ఇబ్ను జరీర్ తెలిపింది. ఆయన ఇలా అన్నారు, హజ్రత్ ఉమర్ తన ఖిలాఫత్ కాలంలో హుదైబియా ప్రాంతంలోకి వెళ్ళినప్పుడు, బయ్‌త్ జరిగిన చెట్టు ఎక్కడుందీ అని అడిగారు. ఒకరు ఒక చెట్టు చూపిస్తే మరొకరు మరొకటి చూపారు. దానికి హజ్రత్ ఉమర్ (ర), 'పోనివ్వండి శ్రమపడవలసిన అవసర మేముంది?' అన్నారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ
## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
(కితాబుత్తఫ్సీర్)

**12. యూసుఫ్ సూరా**

## నిశ్చయంగా నీ ప్రభువు సర్వజ్ఞుడు, మహా వివేకి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: నీ ప్రభువు నిన్ను (తన పని కొరకు) ఎన్నుకుంటాడు. నీకు విషయాల లోతును అందు కోవటం నేర్పుతాడు. నీకూ యాఖూబ్ సంతతికీ తన అనుగ్రహాన్ని పూర్తిగా ప్రసాదిస్తాడు. ఇంతకు పూర్వం ఆయన నీ పెద్దలైన ఇబ్రాహీముకూ, ఇస్హాఖుకూ పూర్తిగా ప్రసాదించినట్లు. నిశ్చయంగా నీ ప్రభువు సర్వజ్ఞుడు, మహా వివేకి. ***(12 : 6)***

**531)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "కరీమ్ బిన్ కరీమ్ బిన్ కరీమ్ బిన్ కరీమ్ – యూసుఫ్ బిన్ యాఖూబ్ బిన్ ఇస్హాఖ్ బిన్ ఇబ్రాహీమ్." (గౌరవ నీయుడు, గౌరవనీయుని కుమారుడు, గౌరవనీయుని మనవడు, గౌరవనీయుని ముని మనవడు యూసుఫ్)– ఆయన యాఖూబ్(అ) కుమారుడు, మరాయనేమో ఇస్హాఖ్(అ) కుమారుడు, మరాయనేమో ఇబ్రాహీమ్(అ) కుమారుడు– వీరంతా దైవప్రవక్తలే.

## గొప్ప సూచనలు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "యథార్థానికి యూసుఫ్, అతని సోదరుల గాథలో అడిగే వారికి గొప్ప సూచనలు ఉన్నాయి." ***(12 : 7)***

**532)** మహనీయ అబూహురైరా(రజి) తెలిపారు: ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసమ్)ను, 'అందరికన్నా ఎక్కువ ఆదరణీయుడు ఎవరు?' అని అడిగారు. దానికి ఆయన(స), "అందరికన్నా ఎక్కువగా దైవానికి భయపడేవాడే అందరికన్నా ఎక్కువ ఆదరణీయుడు" అని చెప్పారు. అప్పుడు ప్రియ సహచరులు, 'మా ప్రశ్నలోని ఉద్దేశం అది కాదండి!' అని విన్నవించుకోగా, "అలాగైతే అందరికన్నా అధికంగా గౌరవ మర్యాదలు కలవారు యూసుఫ్ (అలైహి స్సలామ్). ఆయన దైవప్రవక్త. దైవప్రవక్త కుమారులు. దైవప్రవక్త మనవడు, దైవప్రవక్త ముని మనవడు" అని ప్రవక్త మహనీయులు(స) వివరించి చెప్పారు. 'మా ప్రశ్నలోని ఉద్దేశం అది కూడా కాదండి' అని ప్రియశిష్యులు విన్నవించుకోగా, "ఓహో! మీరు అరబ్బు కుటుంబీకుల గురించి తెలుసుకోదలుస్తున్నారా!?" అని అడిగారు. 'అవునండీ' అని ప్రియ శిష్యులు చెప్పగా, ఆయన(స) ఇలా వివరించారు: "ఇస్లామ్ రాకపూర్వం (అజ్ఞాన కాలంలో) ఎవరు గౌరవాదరణలు కలవారుగా భావించబడేవారో, ఇస్లామ్ వచ్చిన తర్వాత కూడా వారే గౌరవాదరణలకు అర్హులు. కాకపోతే వారికి ధర్మావగాహన[1] అబ్బి ఉండాలి".

★ ఈ సూరా మక్కాలో అవతరించింది. ఇందులో 111 ఆయత్లు ఉన్నాయి. 'యూసుఫ్ (అలైహిస్సలామ్) గురించి మీకేం తెలుసో చెప్పండి?' అని యూదులు (ముష్రిక్కుల చేత) ప్రవక్త ముహమ్మద్(స)ను అడిగించారు. అప్పుడు ఈ సూరా పూర్తిగా - ఒకేసారి- అవతరించింది. యాఖూబ్(అ) తన కుమారుడు యూసుఫ్ (అ)ను అమితంగా ప్రేమించేవారు. ఈ ప్రేమే ఆయన సోదరుల అసూయకు కారణమైంది.

532-1. గౌరవ మర్యాదలకు అర్హులు ఎవరంటే దేవుని పట్ల భయభక్తులు, ధర్మం(దీన్) పట్ల సదవగాహన కలవారే. ఒక వ్యక్తి సయ్యిదీగా, లీడర్గా పిలువబడినంత మాత్రాన అతడు సిసలైన గౌరవ పాత్రుడు కాడు. మరో విషయం ఏమిటంటే ఒక వ్యక్తి ధర్మ జ్ఞాని అయి ఉండటం వేరు, ధర్మం పట్ల మంచి అవగాహన కలిగి ఉండటం. కేవలం జ్ఞానం ఉంటే సరిపోదు; దీన్ (ధర్మం)లో **'తఫఖ్ఖహు'** కలిగి ఉండటం చాలా అవసరం.



- ఏజాజ్ అహ్మద్

# న్యాయవ్యవస్థకు సవాల్‌గా మారుతున్న మూక దాడులు

ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధమైన పాలన పౌరుల ప్రాథమిక హక్కులకు రక్ష. కానీ, వర్తమాన భారతదేశంలో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని, వీధుల్లోనే తీర్పులు చెప్పే అనాగరిక సంస్కృతి విస్తరిస్తోంది. ఒక ఉద్రేకపూరిత సమూహం లేదా ఉన్మాద జన సమూహం కలిసి, ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని జరిపే దాడులను 'మూక దాడులు' అంటారు. నిరాధారమైన అనుమానాలు, వ్యవస్థీకృత అపోహలు, సామాజిక ద్వేషం లేదా కేవలం ఒక పుకారు పునాదిగా సాగే ఈ దాడులు ఆధునిక సమాజంలో అత్యంత క్రూరమైన హింసాత్మక రూపాలుగా పరిణమించాయి.

ఈ తరహా సమూహ హింస ఏ స్థాయికి చేరుకుంటుందంటే, బాధితుడిని ప్రాణాలతో వదిలిపెట్టడానికి ఆ గుంపు ఏమాత్రం సిద్ధంగా ఉండదు. నడుస్తున్న రైలు నుండి కిందకు నెట్టివేయడం, అమానుషంగా కొట్టి నిప్పంటించడం, సజీవ దహనం చేయడం వంటి అత్యంత భయంకరమైన ఉదంతాలు సామాజిక చేతనను కలచివేస్తున్నాయి. ఇలాంటి సంఘటనలలో అత్యధిక శాతం బాధితుల తప్పిదం ఏమీ ఉండదు; కేవలం ఒక వర్గం పట్ల ఉండే ద్వేషం లేదా అనుమానమే వారిని బలి పశువులను చేస్తుంది. ఒక వ్యూహాత్మక ఉన్మాద సమూహంగా ఏర్పడి, బాధితుడిని మరణించేంత వరకు దయారహితంగా బాదడం ఈ రోజుల్లో ఒక తీవ్రమైన సామాజిక రుగ్మతగా మారింది.

## భారతదేశ సామాజిక సందర్భం : విస్తరిస్తున్న సంక్షోభం

భారతదేశ ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తే, 2014 తదనంతర కాలంలో ఈ మూక దాడుల ఉదంతాలు అసాధారణంగా పెరిగాయి. ప్రత్యేకించి ముస్లింలు, దళిత వర్గాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ సమూహ దాడులు దేశంలో ఒక గంభీరమైన సామాజిక సంక్షోభాన్ని, అభద్రతా భావాన్ని సృష్టిస్తున్నాయి. చట్టం, శిక్షల పట్ల నేరగాళ్లలో భయం పూర్తిగా నశించిందనడానికి ఈ ఘాతుకాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. వారు ఎలాంటి సంకోచం లేకుండా, బహిరంగంగానే ఈ నేరాలకు ఒడిగడుతున్నారు. అంతేకాకుండా, ఈ అమానుష కృత్యాలను వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం, సమాజంలో చట్టబద్ధమైన పాలనను సవాలు చేయడమే కాకుండా, ఒక క్రూరమైన ఆనందాన్ని (Sadism) వెతకడం వైపు సమాజం వెళ్తోందని హెచ్చరిస్తోంది.

సామాజిక పక్షపాతాలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా వ్యాపించే పుకార్లు, మతపరమైన ఉద్రిక్తతల ద్వారా సమాజంలో ఒక రకమైన విషపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీనివల్ల విచక్షణ కోల్పోయిన గుంపులు, తమలాంటి తోటి మనుషులపైనే దారుణమైన క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. కేవలం అపోహల ఆధారంగా ఇంతటి విధ్వంసం సృష్టించబడుతుండటం, శరవేగంగా పెరుగుతున్న ఈ నేరాల నివారణకు తక్షణ పరిష్కారం కనుగొనాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తోంది.

దేశంలో ఈ ధోరణి ఎంతలా విస్తరిస్తోందంటే, ఒంటరిగా ప్రయాణించే వ్యక్తులను అత్యంత సాదాసీదా విషయాలకే చుట్టుముట్టి వేధించడం సర్వసాధారణమైపోయింది. చిన్నపాటి వ్యక్తిగత తగాదాలను కూడా ఉద్దేశపూర్వకంగా మతపరమైన లేదా కుల పరమైన రంగు పులిమి, తీవ్రమైన వివాదాలుగా మార్చి, సంబంధిత వ్యక్తిపై భౌతిక దాడులకు దిగుతున్నారు.

ఉదాహరణకు, ఒకరి ఆహారంలో గోమాంసం ఉందనే కేవలం అనుమానంతో లేదా బహిరంగ ప్రదేశాల్లో ప్రార్థనలు చేసుకోవడాన్ని సాకుగా చూపి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇతర వర్గాల వారు తమ ఆచారాలను యథేచ్ఛగా పాటిస్తున్నప్పటికీ, కేవలం ముస్లిం గుర్తింపు ఉన్న వారిని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం ఇక్కడి పక్షపాత వైఖరికి అద్దం పడుతోంది. నడుస్తున్న రైలు నుండి తోసివేయడం, నడిరోడ్డుపై కొట్టి చంపడం వంటి దురదృష్టకర సంఘటనలు ప్రజాస్వామ్య పునాదులను ప్రశ్నిస్తున్నాయి.

## వ్యవస్థీకృత ద్వేషం, మీడియా పాత్ర

ఈ హింసకు గల మూలకారణాలు కేవలం తక్షణ ఆవేశం మాత్రమే కాదు. సమాజంలో ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన వ్యక్తుల మనస్సులలో ఇతర వర్గాల పట్ల ద్వేషం, అసహనం, పక్షపాత వైఖరిని క్రమపద్ధతిలో నూరిపోస్తున్నారు. ఆపై వారిని ఇటువంటి హింసాత్మక మార్గాల వైపు ప్రేరేపిస్తున్నారు. అనేక సందర్భాల్లో వీరికి రాజకీయ లేదా సామాజిక శక్తుల పరోక్ష మద్దతు, చట్టం నుండి రక్షణ లభిస్తుండటం వల్ల, చట్టపరమైన సంస్థలు వీరిపై సమర్థవంతమైన చర్యలు తీసుకోలేకపోతున్నాయి.

దీనికి తోడు సోషల్ మీడియా, కొన్ని ప్రధాన స్రవంతి వార్తా సంస్థలు, డిజిటల్ యాప్‌ల ద్వారా ఉద్రేకాన్ని రగిల్చే అవాస్తవ వార్తలను, పుకార్లను అత్యంత వేగంగా సమాజంలోకి వదులుతున్నారు. కొన్ని మీడియా సంస్థలు (TRP రేటింగుల కోసం) ఒక నిర్దిష్ట వర్గాన్ని సమాజానికి శత్రువులుగా చిత్రీకరిస్తూ, మత విద్వేషాలను పెంపొందించేలా కథనాలను ప్రసారం చేస్తున్నాయి. చాలా సందర్భాల్లో అసలు నిజాలను వక్రీకరించి, ఒక అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేయడం ద్వారా దాన్నే నిజంగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ దుష్ప్రచారం వల్ల ప్రజల్లో పరస్పర అవిశ్వాసం, భయం, పక్షపాతం పెరిగిపోయి వాతావరణం ఉద్రిక్తంగా ఉంటోంది. ఈ ఉద్రిక్తతలే చివరకు మూక దాడుల వంటి దురాగతాలకు దారితీస్తున్నాయి. ఈ విధంగా సోషల్ మీడియా, మెయిన్‌స్ట్రీమ్ మీడియా రెండూ సామాజిక నేరాన్ని ప్రేరేపించడంలో ఉత్ప్రేరకాలుగా మారుతున్నాయి.

## చోటుచేసుకున్న కొన్ని ప్రధాన ఉదంతాలు: కాలక్రమం (2015-2026)

గత దశాబ్ద కాలంలో దేశంలో మూక హింసకు సంబంధించి ఒక సుదీర్ఘమైన నల్లటి అధ్యాయం నడిచింది, ఇందులో ఎందరో అమాయకులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఈ బాధితులలో అత్యధికులు ముస్లింలు, కొందరు దళిత వర్గాలకు చెందినవారు. గోరక్షణ పేరిట సృష్టించబడిన ఉద్రిక్త వాతావరణం వల్ల కేవలం అనుమానాలు, పుకార్ల ఆధారంగా ఎందరో అన్యాయంగా ప్రాణాలు కోల్పోయారు.

**దాద్రి** : ఉత్తరప్రదేశ్‌లోని దాద్రి గ్రామానికి చెందిన మహ్మద్ అఖ్లాక్ అనే వ్యక్తిని తన ఇంట గోమాంసం ఉంచుకున్నాడనే నిరాధారమైన అనుమానంతో ఒక ఉన్మాద గుంపు కొట్టి చంపింది.

**అల్వార్** : పెహలూ ఖాన్ అనే వ్యక్తిని ఆవుల అక్రమ రవాణా దారుడిగా ముద్రవేసి హింసాత్మకంగా హతమార్చారు.

**ఝార్ఖండ్** : తబ్రేజ్ అన్సారీ అనే యువకుడిని బలవంతంగా మతపరమైన నినాదాలు చేయమని శాసిస్తూ తీవ్రంగా హింసించి చంపారు. ఇండోర్‌లో గాజులు అమ్ముకునే ముస్లిం వ్యాపారిపై దాడి, అజ్మీర్‌లో ఒక ముస్లిం యాచకుడిని వేధించి పాకిస్తాన్ వెళ్ళిపొమనడం వంటి సంఘటనలు మానవత్వానికే మచ్చగా నిలిచాయి.

**ఏప్రిల్ 2026** : బరేలీ నుండి ప్రయాణిస్తున్న 30 ఏళ్ల మౌలానా తౌసీఫ్ రజా మజహరీని తీవ్రంగా గాయపరిచి, వేగంగా వెళ్తున్న రైలు నుండి కిందకు నెట్టివేశారు. అతని భార్య తెలిపిన వివరాల ప్రకారం, చివరి ఫోన్ కాల్‌లో అతను ప్రాణభయంతో సహాయం కోసం అర్థించడం వినబడింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి అరెస్టులు నమోదు కాకపోవడం ఆందోళనకరం.

**జనవరి 2026** : ఉత్తరాఖండ్‌లోని కోట్‌ద్వార్ ప్రాంతంలో వకీల్ అహ్మద్ అనే వృద్ధుడిని, అతను తన దుకాణానికి "బాబా స్కూల్ డ్రెస్ అండ్ మ్యాచింగ్ సెంటర్" అని పేరు పెట్టుకున్నాడనే ఏకైక కారణంతో వేధించారు. ఒక ఉన్మాద గుంపు అతని దుకాణాన్ని ముట్టడించి, నష్టం కలిగించడానికి ప్రయత్నించింది. అయితే, అదే ప్రాంతానికి చెందిన దీపక్ అనే వ్యక్తి ధైర్యంగా ముందుకు వచ్చి, ఆ వృద్ధుడిని రక్షించడంలో కీలక పాత్ర పోషించాడు.

## గణాంకాల లోపం, చట్టపరమైన శూన్యత

దేశంలో నేరాల రికార్డులను నమోదు చేసే నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB), మూక దాడుల పేరుతో ప్రత్యేకంగా ఎలాంటి అధికారిక గణాంకాలను విడుదల చేయడం లేదు. ఎందుకంటే భారతీయ చట్టాలలో ఈ నేరానికి సంబంధించి ప్రత్యేక చట్టపరమైన విభాగం (Separate Legal Category) లేదు. అందువల్ల, ఇటువంటి దాడులను భారతీయ శిక్షా స్మృతి (IPC) లేదా నూతన భారతీయ న్యాయ సంహిత (BNS) కింద హత్య, అల్లర్లు లేదా హత్యాయత్నం వంటి సాధారణ నేరాల కిందనే నమోదు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం గతంలో పార్లమెంటుకు సమర్పించిన సమాచారం ప్రకారం, NCRB 2017లో మూక దాడులు, ద్వేష పూరిత నేరాల (Hate Crimes) డేటాను సేకరించడం ప్రారంభించింది. కానీ తదనంతరం, రాష్ట్రాలు అందించిన సమాచారంలో విశ్వసనీయత లోపించిందని పేర్కొంటూ ఆ ప్రక్రియను నిలిపివేసింది. వార్షిక "క్రైమ్ ఇన్ ఇండియా" నివేదిక నుండి ఆ విభాగాలనే తొలగించింది. ఈ చట్టపరమైన శూన్యత నేరస్థులకు పరోక్షంగా వరంగా మారుతోంది.

ప్రభుత్వ అధికారిక గణాంకాలు అందుబాటులో లేనప్పటికీ, human rights సంస్థలు, స్వతంత్ర పరిశోధనా సంస్థలు (Fact Checker.in, 'సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం' - CSSS వంటివి) ఈ సంఘటనల వివరాలను సేకరిస్తున్నాయి.

### CSSS నివేదికల ప్రకారం గణాంకాలు:

| సంవత్సరం | నమోదైన మూక దాడుల సంఘటనలు |
|---|---|
| 2018 | 48 |
| 2019 | 107 |
| 2020 | 23 |
| 2024 | 13 |
| 2025 | 14 (8 మంది మరణం, 14 మందికి గాయాలు) |

ఈ నివేదికల విశ్లేషణ ప్రకారం, ఈ సంఘటనలలో అధిక శాతం గోరక్షణ, లవ్ జిహాద్ అనుమానాలు, అంతర మత సంబంధాలు, దొంగతనం ఆరోపణలు, మతపరమైన పక్షపాతాలకు సంబంధించినవే. FactChecker.in నివేదికల ప్రకారం, 2010 నుండి 2017 మధ్య కాలంలో గోరక్షణ పేరిట జరిగిన హింసలో దాదాపు 63 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడులన్నింటిలో ముస్లింలే అత్యధికంగా, అసంబద్ధమైన రీతిలో లక్ష్యంగా చేసుకోబడ్డారని వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

## పరిష్కారాలు

మూక దాడులు అనేవి కేవలం లా అండ్ ఆర్డర్ (శాంతిభద్రతల) సమస్య మాత్రమే కాదు, ఇది సమాజం నైతికంగా పతనమవు తోందనడానికి సంకేతం. ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించా లంటే, ప్రభుత్వం, చట్టసభలు అత్యంత దృఢమైన వ్యూహాత్మక చర్యలు చేపట్టాలి.

గౌరవనీయ సుప్రీంకోర్టు 2018లోనే (తెహసీన్ పూనావాలా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో) మూక హింసను అరికట్టడానికి కొన్ని స్పష్టమైన మార్గదర్శకాలను (Guidelines) జారీ చేసింది. అందులో ప్రత్యేక అధికారుల నియామకం, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, బాధితులకు తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పించడం, ప్రత్యేక చట్టాలను రూపొందించడం వంటి అంశాలు ఉన్నాయి. జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు తమ అసెంబ్లీలలో బిల్లులను ఆమోదించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రాజకీయ సంకల్పం లోపించడం వల్ల ఈ చట్టాలు నిర్వీర్యమవుతున్నాయి.

### తక్షణ అవశ్యకతలు:

**1. ప్రత్యేక చట్టం, పారదర్శక విచారణ** : మూక దాడులను ఒక ప్రత్యేక నేరంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాన్ని తీసుకురావాలి. సమాజంలో ద్వేషాన్ని రగిల్చే ప్రసంగాలు (Hate speeches) చేసే వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలను నిష్పక్షపాతంగా అమలు చేసి, నేరస్థులను త్వరగా శిక్షించడం ద్వారా మాత్రమే వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది.

**2. డిజిటల్ అకౌంటబిలిటీ (జవాబుదారీతనం)** : తప్పుడు పుకార్లు, మతపరమైన ద్వేషపూరిత ప్రచారాల వల్ల కలిగే వినాశకరమైన పరిణామాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలి. సమాజంలో ఉద్రిక్తతలను పెంచే అబద్ధపు సమాచారాన్ని, ఉద్వేగభరితమైన అంశాలను వ్యాప్తి చేసే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై, ఖాతాలపై డిజిటల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

**3. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు** : న్యాయవ్యవస్థ ఈ తరహా కేసులలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కాలయాపన లేకుండా కేసుల విచారణను పూర్తి చేసి, దోషులకు తక్షణమే శిక్షలు ఖరారు చేయాలి.

చివరగా, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన మన సామాజిక నిర్మాణంలో మత సామరస్యాన్ని, సోదరభావాన్ని పునరుద్ధరించడం అత్యంత ఆవశ్యకం. స్థానిక ప్రాంతాలలో వివిధ మతాలు, వర్గాల ప్రజలు ఒకరినొకరు కలుసుకోవడానికి, పరస్పర నమ్మకాలను గౌరవించుకోవడానికి వీలుగా "సద్భావన వేదికలను" ఏర్పాటు చేయాలి. చట్టాన్ని గౌరవించే పౌర సమాజం, నిష్పక్షపాతంగా వ్యవహరించే పాలనా యంత్రాంగం కలిసినప్పుడే ఈ 'మూక దాడుల' ఉన్మాదానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. ❖

- డాక్టర్ కుత్బుద్దీన్



# ముహర్రం సందేశం

ముస్లింల నూతన సంవత్సర ఆరంభాన్ని సూచించే ముహర్రం మాసంలో చోటుచేసుకున్న 'కర్బలా సంగ్రామం' ఒక చారిత్రక ఘట్టం. మహనీయ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) వారి ప్రియతమ మనవడు హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజిఅల్లాహు అన్హ), వారి పవిత్ర కుటుంబ సభ్యులు సత్యం కోసం, ధర్మ రక్షణ కోసం తమ ప్రాణాలను ధారపోసిన అమరత్వ గాధ ఇది.

కర్బలా మైదానంలో జరిగింది కేవలం రెండు సైన్యాల మధ్య హోరాహోరీ పోరాటం కాదు; అది కేవలం భౌతికమైన అధికార కాంక్షతో ముడిపడిన యుద్ధమూ కాదు. అది నూటికి నూరు శాతం 'సత్యం–అసత్యాల' మధ్య, 'న్యాయం–అన్యాయాల' మధ్య సాగిన పవిత్రమైన సైద్ధాంతిక సంగ్రామం. నాటి పాలకుడు ఇస్లామిక్ మూల సూత్రాలను, షరియా నియమాలను తన స్వార్థం కోసం మార్చడానికి పూనుకున్నాడు. ఆ క్రమంలో మానవీయ విలువలు కుప్పకూలిపోతున్న తరుణంలో–ధర్మాన్ని నిలబెట్టడానికి, అన్యాయాన్ని ఎదిరించడానికి ఇమామ్ హుసైన్ సింహంలా కదిలారు. ఆకలి, దప్పికల తీవ్రత నడుమ, కంటిపాపల్లాంటి పసిబిడ్డలు కళ్లముందే అమరులవుతున్నా, ఆయన అసత్యం ముందు తలవంచలేదు. "తల తెగినా సరే, నవ్వుతూ ధర్మం కోసం ప్రాణాలర్పించవచ్చు" అని ఆయన ప్రపంచానికి చాటిచెప్పారు. అందుకే, ఆ రోజు ఇమామ్ హుసైన్ భౌతికంగా ఓడిపోయినట్లు కనిపించినా, నైతికంగా యజీద్ అహంకారమే మట్టికరిచింది. ఇస్లాం ప్రతి కర్బలా త్యాగం తర్వాత మరింత పవిత్రంగా పునర్జీవిస్తుందనే సత్యం జగద్విదితమైంది.

ప్రియ ప్రవక్త మహమ్మద్ పొట్టకు రాళ్లు కట్టుకుని, అతుకుల బట్టలు వేసుకుని కూడా రాత్రంతా నమాజుల్లో నిలబడి ఆచరణాత్మక జీవితాన్ని నేర్పారు. కర్బలా మైదానంలో ఇమామ్ హుసైన్ ధర్మం కోసం తన తలను అర్పించింది కేవలం మనం నినాదాలు చేయడానికి కాదు, మనం కూడా మన నిత్య జీవితాల్లో నిజాయితీగల మనుషులుగా బతకడానికి.

హుసైనీ భావన (జజ్బా–ఎ–హుసైనీ) అంటే కేవలం ఉద్వేగభరితమైన నినాదాలు చేయడం కాదు; అదొక నిశ్శబ్ద విప్లవం. నిత్య జీవితంలో మోసాన్ని, అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ సత్య మార్గంలో నడవడం, అంతరంగంలో పేరుకుపోయిన ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలను వీడి, ఇతరులను మనస్ఫూర్తిగా క్షమించగలిగే పవిత్ర హృదయాన్ని అలవర్చుకోవడం. ఏ బాహ్య ప్రదర్శన, ఆడంబరాల జోలికి పోకుండా కేవలం దైవ ప్రసన్నత కోసం, సమాజ హితం కోసం బతకడమే నిజమైన హుసైనీ తత్వం.

మనం కోరుకునే స్వర్గం అంత సులభంగా రాదు, దానికి నిస్వార్థమైన ఆచరణ, అంతఃశుద్ధి ఎంతో అవసరం. మన దైనందిన జీవితాన్ని ప్రవక్త చూపిన సున్నత్ (మార్గాచరణ) వైపునకు మలుచుకుంటూ, మన గుండెల్లో ఆ త్యాగధనుల భావాన్ని నిజాయితీగా ప్రతిష్ఠించుకున్నప్పుడే... మనం జరుపుకునే ప్రతి ముహర్రానికి, కార్చే ప్రతి కన్నీటి చుక్కకు నిజమైన సార్థకత లభిస్తుంది. మార్పు ముఖ్యం, అది మాటల నుండి కాక ఆచరణ నుండి ప్రారంభం కావడమే నేటి కాలపు అత్యంత ప్రధానమైన అవసరం.




- మైమూనా ఫాతిమా

# గుర్తింపు లేని గృహభారం!

**ఆదివారం వస్తోందంటే చాలు.. ఆ ఇంట్లో ఒకటే హడావుడి. ఆడపడుచు, ఆమె నలుగురు పిల్లలు, భర్తతో కలిసి పుట్టింటికి వచ్చే రోజు అది.** ఒకే నగరంలో ఉండటం వల్ల తరచూ కలుసుకునే వీలుండటం ఆ కుటుంబానికి ఒక పెద్ద అనుకూలత. కానీ, ఆ ఇంటికి ఏకైక కోడలైన ఆమెకు మాత్రం అదొక సవాలుతో కూడిన బాధ్యత. గృహకృత్యాల భారమంతా ఒంటరిగానే మోసే ఆ ఇల్లాలు, ఈ ఆదివారం విందు కోసం శనివారం ఉదయం నుంచే ఏర్పాట్లు ప్రారంభించింది.

## తెర వెనుక శ్రమ.. తెల్లవారని ఆరాటం

"మా అల్లుడికి కొత్తిమీర చట్నీ అంటే ప్రాణం.. అది లేకపోతే ఆయన ముద్ద ముట్టరు" అని అత్తగారు ముందే చెప్పారు. ఆదివారం ఉదయపు కంగారులో ఎక్కడ మర్చిపోతానోనన్న ఆందోళనతో, శనివారం ఉదయమే ఎంతో ఇష్టంగా చట్నీ నూరి ఫ్రిజ్‌లో భద్రపరిచింది కోడలు.

శనివారం రోజంతా మిగిలిన పనులతోనే సరిపోయింది. వయసు పైబడి, అనారోగ్యంతో ఉన్న అత్తగారి సేవలు చూసుకుంటూనే, రాత్రి కుటుంబ సభ్యులందరికీ వంట చేసి, వడ్డించి, గిన్నెలు తోమిన తర్వాత మరుసటి రోజు విందు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. శనగపప్పు- చికెన్ కలిపి కబాబ్ మిశ్రమాన్ని పొయ్యి మీద పెట్టింది.. మరోపక్క చేప ముక్కలను మ్యారినేట్ చేసి ఫ్రీజర్‌లో పెట్టింది.. ఆపై దాదాపు గంటకు పైగా శ్రమించి నోరూరుంచే 'ఫిర్నీ' స్వీట్ సిద్ధం చేసింది. ఈ పనులన్నీ ముగించి, వంటగదిని శుభ్రం చేసుకునేసరికి రాత్రి పన్నెండు గంటలైంది. శరీరం అలసటతో హూనమైనా, నమాజ్ సమయం దాటిపోయిందన్న ఆవేదనతో ఆ రాత్రికి 'ఖజా' పూర్తి చేసుకుంది.

గదిలోకి వెళ్లేసరికి భర్త అప్పటికే గాఢ నిద్రలో ఉన్నారు. మనసు నిండా మరుసటి రోజు పనుల గురించిన ఆందోళనతో ఎన్నో పక్కలు మారి ఎట్టకేలకు కళ్లు మూసిందో లేదో.. అంతలోనే అలారమ్ మోగింది.

## ఆదివారం హడావుడి.. ఆదరణ లేని ఇల్లాలు

ఉదయాన్నే లేచి నమాజ్ ముగించి, ఇల్లంతా శుభ్రం చేసి, అందరికీ అల్పాహారం వడ్డించేసరికి అతిథులు రానే వచ్చారు. వారికి మర్యాదగా టీ, నీళ్లు అందించి, అలసటను సైతం లెక్క చేయకుండా వంటగదిలోకి పరుగెత్తింది. మటన్ కుర్మా

వండటానికి రెండు గంటలు పట్టింది. ఆపై బిర్యానీ పనుల్లో నిమగ్నమైంది. నడుము విరుచుకుపోతున్నా, కాసేపు హాయిగా కళ్లు మూసుకునే వీలు కూడా ఆ స్థితిలో ఆమెకు లేదు.

ఇంతలో భర్త వంటగదిలోకి వచ్చి, నీళ్లు తాగి మారు మాట్లాడకుండా వెళ్ళిపోయారు. "భార్యకు పనుల్లో చేదోడు వాదోడుగా ఉండవచ్చు కదా!" అని ఒక క్షణం అనిపించినా.. "ఎలాగూ ఇది ఇల్లాలు  చేయాల్సిన పనే కదా"  అని సరి పెట్టుకుంది.

చివరకు కబాబ్‌లు వేయించి, సలాడ్ కోసి, డైనింగ్ టేబుల్‌పై భోజనం అమర్చేసరికి మధ్యాహ్నం రెండు గంటలైంది.

## కోరికల వెల్లువ.. పట్టింపు లేని హృదయాలు

అందరూ భోజనానికి కూర్చోగానే పిల్లలు గొడవ చేయడం మొదలుపెట్టారు; వారికి 'పాస్తా' కావాలట! దానికి ఆడపడుచు భుజాలు ఎగరేస్తూ నిర్లక్ష్యంగా నవ్వి, "ఈ పిల్లలు ఇంట్లో కూడా ఈ భోజనం ఎక్కువగా తినరు. ఒకవేళ నువ్వు చేయలేననుకుంటే బయట నుండి ఆర్డర్ ఇచ్చెయ్" అంది ఈసడింపుగా.

ఆమె ఆశగా భర్త వైపు చూసింది.. కానీ ఆయన  ముఖంలో ఉదాసీనతే తప్ప భార్య శ్రమ పట్ల గౌరవం కనిపించలేదు. అత్తగారు కూడా మద్దతుగా ఒక్క మాట మాట్లాడలేదు. చేసేదేమీ లేక, భారమైన హృదయంతో మళ్లీ వంటగదిలోకి వెళ్ళింది. ఆకలి, అలసటతో ప్రాణం సొమ్మసిల్లుతున్నా.. కూరగాయలు కోసి పాస్తా చేయడం ప్రారంభించింది. ఇంతలో ఆడపడుచు చిన్న కొడుకు "నాకు పొటాటో చిప్స్ కావాలి" అని ఏడవడం మొదలుపెడితే, పాస్తా ఉడుకుతుండగానే బంగాళాదుంపలు కోసి వాడి కోసం చిప్స్ కూడా తయారు చేసింది.

## గుండె కోత.. మిగిలిన నింద

చివరకు ఆమె వంటగది నుండి బయటకు వచ్చేసరికి అందరూ భోజనాలు ముగించి లేచారు. కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా మర్యాదకైనా "నువ్వు కూర్చో.. భోజనం చెయ్" అని పిలవలేదు. గొంతు వరకు వచ్చిన కన్నీళ్లను బలవంతంగా మింగుకుంటూ, వారిని ప్రసన్నం చేసుకోవాలనే ఉద్దేశంతో నవ్వుతూ.. "వంట ఎలా కుదిరింది?" అని  అడిగింది. కానీ భర్త మినహా ఎవరి నుంచీ సమాధానం లేదు.

అతిథులు వెళ్ళిపోయాక, అప్పటివరకు కడుపు మార్చుకున్న ఆమె మిగిలినది ఏదో ఒకటి తిందామని టేబుల్ దగ్గర కూర్చుని, మొదటి ముద్ద నోటి దగ్గరకు తీసుకెళ్లిందో లేదో.. అత్తగారి కంఠస్వరం ఉరుములా వినిపించింది:

"నా కూతురు ఈ ఇంటికి రావడం గానీ, నువ్వు ఆమెకు సేవ చేయడం గానీ నీకు ఇష్టం లేకపోతే ఆ మాట ఏదో ముందే స్పష్టంగా చెప్పేయాల్సింది. ఇకపై నిన్ను ఇంతలా శ్రమ పెట్టను. నేనే స్వయంగా ఈ పనులన్నీ చేసుకోగలను, నీ ఉపకారాలు మాకు అవసరం లేదు."

ఆమె దిగ్భ్రాంతి చెంది.. తడబడుతూనే, "ఏమైంది అమ్మా? వంటలో ఏమైనా లోటు జరిగిందా?" అని అడిగింది.

"ఆరిఫ్ కొత్తిమీర చట్నీ లేనిదే ముద్ద ముట్టడని నేను నీకు నిన్ననే చెప్పాను కదా! కానీ నువ్వు కావాలనే మొండితనంతో అతని కోసం చట్నీ చేయలేదు" అంది అత్తగారు కోపంగా.

ఆమెకు నోట మాట రాలేదు. ఆ చట్నీ తాను ముందే చేసి ఫ్రిజ్‌లో పెట్టానని, కేవలం టేబుల్‌పై ఉంచడం మర్చిపోయానని వివరించే ఓపిక కూడా నశించింది. మనస్ఫూర్తిగా శ్రమించినా దక్కిన ఈ అవమానాన్ని ఆమె హృదయం భరించలేకపోయింది. టేబుల్ దగ్గర ఒంటరిగా మిగిలిపోయిన ఆమె కళ్లలోంచి జారిన కన్నీటి ధార.. ఆమె నిశ్శబ్ద వేదనకు సాక్ష్యంగా నిలిచింది.

## ఆలోచించండి..

మీరు ఆడపడుచు స్థానంలో ఉంటే: మీ వదిన లేదా కోడలు మీ కోసం పడే శ్రమను గుర్తించండి. నాలుగు గోడల మధ్య, వంటగది సెగల్లో ఆమె పడే కష్టం ఇల్లాలి బాధ్యత మాత్రమే కాదు, మీపై ఉన్న ప్రేమ కూడా. ఆమె చేసిన వంటను మనస్ఫూర్తిగా అభినందించండి.

మీరు కోడలి స్థానంలో ఉంటే: పనులన్నింటినీ మీరే నెత్తిన వేసుకోకండి. ఇంట్లోని ఇతరులను, ముఖ్యంగా భర్తను కూడా చిన్న చిన్న పనుల్లో భాగస్వాములను చేయండి. అప్పుడే మీరు పడే కష్టం ఇతరులకు కళ్లారా కనిపిస్తుంది, దానికి  విలువ ఉంటుంది.

చివరగా.. తెరవెనుక జరిగే అసలు శ్రమ ఇతరులకు తెలియక పోవడం వల్లే ఇలాంటి చేదు సంఘటనలు ఎదురవుతుంటాయి. నిశ్శబ్ద సేవలకు గుర్తింపు లేని చోట,  ఆత్మాభిమానం గాయపడటం సహజం. కుటుంబంలో పరస్పర గుర్తింపు, చిన్న అభినందన ఉంటే ఇలాంటి మనస్తాపాలకు తావుండదు.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పొదరాయి
గీటురాయి
వారపత్రిక




తహూరా సిద్దీఖా

ఖురాన్ లో "నిశ్చయంగా అల్లాహ్, మేలు చేసేవారిని ప్రేమిస్తాడు" (ఇన్నల్లాహ యుహిబ్బుల్ ముహ్సినీన్) అనే వాక్యం అనేక చోట్ల (ఆల్ ఇమ్రాన్ 3:134, 148; అల్-మాయిదా 5:13, 93) ప్రస్తావించబడింది.

ఖురాన్ అనువాదకులు 'ముహ్సినీన్' అనే పదానికి ఎంతో లోతైన అర్థాలను ఇచ్చారు. ఉపకారం చేసేవారు, మేలు చేసే స్వభావం కలవారు, సత్కార్యాలు ఆచరించేవారు, సచ్చరిత్రులు, ఉత్తమ ప్రవర్తన గలవారు, ఏ పనైనా ఎంతో చక్కగా, నైపుణ్యంతో నిర్వర్తించేవారే 'ముహ్సినీన్'.

## మేలు చేసేవారి ఉత్తమ లక్షణాలు

**దాన గుణం** : అల్లాహ్ మార్గంలో పేదలు, నిరుపేదలు, అవసరార్థుల సహాయార్థం తమ సంపదను ధారాళంగా ఖర్చు చేస్తారు.

**ఉదారత** : పిసినారితనం, అత్యాశల నుండి తమను తాము కాపాడుకుంటారు.

**ఆత్మనిగ్రహం** : తీవ్రమైన కోపం వచ్చినప్పుడు కూడా దానిని అణచుకుంటారు.

**క్షమాగుణం** : ఇతరుల తప్పులను క్షమించి, ఉపేక్షించే హృదయాన్ని కలిగి ఉంటారు.

**పశ్చాత్తాపం** : ఏదైనా పొరపాటు లేదా పాపం జరిగినప్పుడు వెంటనే అప్రమత్తమై, తప్పు తెలుసుకొని దేవుని క్షమాపణ (తౌబా) వేడుకుంటారు.

**దృఢసంకల్పం** : పాపపు పనులకు దూరంగా ఉండాలని గట్టిగా నిర్ణయించుకుంటారు.

**పవిత్రత** : దైనందిన జీవితంలో శారీరక, మానసిక, పవిత్రతను అవలంబిస్తారు.

## సమాజ హితం

కొన్ని ఆయత్‌లలో సమాజ హితానికి సంబంధించిన నిర్దేశాల తర్వాత వెంటనే "ఇన్నల్లాహ యుహిబ్బుల్ ముహ్సినీన్" అని పేర్కొనబడింది. అవి :

పాపాలకు, చెడు మార్గాలకు దూరంగా ఉండటం.

దైవభీతితో హృదయాలను నింపుకోవడం, తఖ్వా (ధర్మాచరణ) అవలంబించడం.

ఎవరివైనా పొరపాట్లు జరిగితే కోపంతో పగ తీర్చుకోకుండా, వారిని మన్నించడం.

సన్మార్గాన్ని ఎంచుకోవడమే కాకుండా, ఇతరులను కూడా ఆ మంచి వైపునకు ఆహ్వానించడం.

## 'మేలు' విస్తృత అర్థం

ఈ పనులన్నీ నిస్సందేహంగా 'ఖైర్' (మేలు/పుణ్యం) పరిధిలోకి వస్తాయి. ఖురాన్, హదీసుల ప్రకారం 'ఖైర్' పరిధి చాలా విస్తృత మైనది. దీనికి 'హుకూఖుల్లాహ్' (అల్లాహ్ పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యతలు), 'హుకూఖుల్ ఇబాద్' (సమాజం, ప్రజల పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యతలు) రెండింటితోనూ ప్రత్యక్ష సంబంధం ఉంది. అంటే, అల్లాహ్, ఆయన ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ల పట్ల నిజాయితీతో కూడిన విధేయతను కలిగి ఉండటమే ఖైర్.

అరబీ భాషలో 'ఖైర్' (బహువచనం: 'ఖైరాత్') అనే పదాన్ని చాలా విస్తృత మైన అర్థంలో ఉపయోగిస్తారు. కానీ సాధారణ వాడుకలో ఇది కేవలం యాచకుడికి లేదా పేదవాడికి కొద్దిగా డబ్బు ఇవ్వడం అనే పరిమిత అర్థానికే పరిమితమైపోయింది. నిజానికి అల్లాహ్ ప్రసన్నత కోసం చేసే ప్రతి ఒక్క మంచి పనీ 'ఖైర్' కిందకే వస్తుంది.

## ఖురాన్‌లో పుణ్యకార్యాల ప్రస్తావన

ఖురాన్‌లోని అనేక ఆయత్‌లలో మంచి పనులను సూచించడానికి రకరకాల పదాలను ఉపయోగించారు:

**అల్-ఖైరాత్** : సాధారణ సత్కార్యాలు లేదా పుణ్యకార్యాల అర్థంలో ఈ పదాన్ని ఉపయోగించారు (ఆల్ ఇమ్రాన్ 3:114, అల్-ముఅమినూన్ 23:61).

**హసనహ్ / హసనాత్** : మంచి, పుణ్యకార్యాల కోసం ఖురాన్‌లో ఈ పదాలు కూడా అనేక చోట్ల వచ్చాయి (అల్-అన్ఆమ్ 6:160, అల్-ఫుర్ఖాన్ 25:70).

**అమలె సాలెహ్** : సత్కార్యాల కోసం ఖురాన్ ఉపయోగించిన అత్యంత సమగ్రమైన, పరిపూర్ణమైన పారిభాషిక పదం ఇది.

## సత్కార్యాల ఫలితాలు- శుభాలు..

సత్కార్యాల వల్ల ఇతరులకు మేలు జరగడమే కాకుండా, స్వయంగా ఆ పనులు చేసేవారికి కూడా ఎంతో శ్రేయస్కరం. ప్రజల హితం కోసం పాటుపడే వ్యక్తికి అల్లాహ్ అపారమైన మానసిక ప్రశాంతతను ప్రసాదిస్తాడు. అన్నింటికంటే పెద్ద బహుమతి ఏమిటంటే, అతను అల్లాహ్‌కు అత్యంత ప్రియమైన దాసుడిగా మారిపోతాడు. ఈ సత్కార్యాల ప్రతిఫలం పరలోక జీవితంలో ఉపయోగపడే అత్యంత విలువైన నిధిగా మారుతుంది.

ఖురాన్ బోధనలను లోతుగా పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవు తుంది. ఎక్కడైతే సత్కార్యాలను ఆదేశించారో, అక్కడ ఇదే "మీ అందరికీ ఎంతో ఉత్తమమైనది", "స్వయంగా మీ కోసమే ఈ మేలు దాగి ఉంది" వంటి పదాలను ఉపయోగించారు. అంటే మనం చేసే పుణ్యం వల్ల మొదటి మేలు మనకే కలుగుతుంది.

## ఖురాన్ గ్రంథం బోధించిన ముఖ్యమైన మార్గదర్శకాలు

సత్కార్యాల ద్వారా ఇహపరాల శ్రేయస్సును సాధించడానికి ఖురాన్ క్రింది విషయాలను ఆజ్ఞాపించింది:

- ➢ కేవలం ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధ్యుడిగా నమ్మడం, ఆయనపై హృదయపూర్వకంగా విశ్వాసం (ఈమాన్) ఉంచడం.
- ➢ దైవభీతి కలిగి ఉండటం, దైవవిధేయతను పాటించడం, వాగ్దాన భంగం చేయకుండా ఉండటం.
- ➢ దైవిక ఆజ్ఞలను పాటించే క్రమంలో ఎదురయ్యే కష్టాలను, నష్టాలను సహనంతో భరించడం.
- ➢ అల్లాహ్ మార్గంలో తమ ప్రాణాలను, సంపదను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండటం.
- ➢ అల్లాహ్ ప్రసన్నతను ఆశిస్తూ బంధువులు, నిరుపేదలు, బాటసారుల హక్కులను (హుకూఖ్) నెరవేర్చడం.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

➢ సామాజిక జీవితంలో ఇతరుల ఇళ్లలోకి ప్రవేశించే ముందు అనుమతి తీసుకోవడం లాంటి ఉత్తమ సంస్కారాన్ని పాటించడం.

## సత్కార్యాలలో పోటీ పడాలనే ప్రేరణ

ఖురాన్‌లో విశ్వాసుల ప్రత్యేక విశిష్టతలలో 'ముసాబఖత్ బిల్-ఖైరాత్' (పుణ్యకార్యాలలో ఒకరినొకరు మించిపోవడానికి ప్రయత్నించడం), 'ముసారఅత్ ఫిల్-ఖైరాత్' (పుణ్యకార్యాల వైపు వేగంగా దూసుకుపోవడం) గురించి ప్రస్తావించబడింది.

దైవవాణి ఈ విధంగా ఉంది: "అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసిస్తారు. మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడుల నుండి ఆపుతారు. సత్కార్యాలలో సతతం చురుకుగా ఉంటారు. వారు సజ్జనులు. (ఆల్ ఇమ్రాన్ 3:114)

ఖురాన్ విశ్వాసులకు పిలుపునిస్తూ-" కాబట్టి, సత్కార్యాల వైపు ఒకరినొకరు మించిపోవడానికి పోటీ పడండి" అని ఆదేశించింది (అల్-బఖరా 2:148). అల్లాహ్ క్షమాపణ, స్వర్గాన్ని పొందడానికి వేగంగా ముందుకు సాగడం అంటే, దానికి సాధనమైన పుణ్యకార్యాల మార్గంలో ముందంజ వేయడమే.

## మానవ వర్గీకరణ

సూరహ్ ఫాతిర్‌లోని 32వ ఆయత్ ప్రకారం, దైవగ్రంథాన్ని అనుసరించడంలో మనుషులను మూడు వర్గాలుగా విభజించడం జరిగింది:

1. తమ ఆత్మలపై తామే అన్యాయం చేసుకునేవారు (పాపాలు చేసేవారు).

2. మధ్యస్థ మార్గాన్ని అవలంబించేవారు.

3. అల్లాహ్ అనుగ్రహంతో పుణ్యకార్యాలు చేయడంలో అందరికంటే ముందుకు దూసుకుపోయేలా ముందంజ వేసేవారు. ఈ మూడవ వర్గం వారికే అల్లాహ్ 'అత్యంత గొప్ప అనుగ్రహాన్ని' వాగ్దానం చేశాడు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి అమూల్యమైన వచనం (హదీసు) ప్రకారం: "ఒక విశ్వాసి (మోమిన్) అతని గమ్యస్థానం స్వర్గం అయ్యేంతవరకు అతను సత్కార్యాలు చేస్తూనే ఉంటాడు." (జామె తిర్మిజి)

## అల్లాహ్‌కు ప్రియమైన దాసులు

సమాజంలో ప్రజలతో దయాగుణంతో మెలగేవారిని అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడు. హజ్రత్ జైద్ (రజిఅల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక హదీసులో దీని గురించి ఇలా ఉంది:

నేను ప్రవక్త గారిని, "ఓ అల్లాహ్ ప్రవక్తా! అల్లాహ్ ఇష్టపడే వ్యక్తిలో కనిపించే సూచన ఏమిటి?" అని అడిగాను. దానికి ప్రవక్త గారు, "ఓ జైద్! ఈ ఉదయం నీవు ఏ స్థితిలో మేల్కొన్నావు?" అని ప్రశ్నించారు. నేను, "నేను పుణ్యాన్ని, పుణ్యకార్యాలు చేసేవారిని అమితంగా ప్రేమిస్తున్నాను. నా వద్ద సామర్థ్యం ఉంటే ఏ మంచి పనైనా చేయడానికి వెంటనే పూనుకుంటాను. ఒకవేళ ఏదైనా పుణ్యకార్యం చేసే అవకాశం కోల్పోతే, ఎంతో దుఃఖిస్తాను" అని మనవి చేశాను. అప్పుడు ప్రవక్త గారు, "అల్లాహ్ ఏ వ్యక్తిని అయితే ఇష్టపడతాడో, అతనిలో ఉంచే సూచన ఇదే!" అన్నారు.

దీనిని బట్టి, పుణ్యకార్యాల పట్ల ఒక వ్యక్తికి ఉన్న ఆసక్తే అల్లాహ్ అతడిని ప్రేమిస్తున్నాడనడానికి స్పష్టమైన నిదర్శనం.

## ఇన్ఫాఖ్ (దానగుణం) - ప్రత్యేక విశిష్టత

సత్కార్యాలన్నింటిలోకి 'ఇన్ఫాఖ్ ఫీ సబీలిల్లాహ్' (అల్లాహ్ ప్రసన్నత కోసం పేదలు, అవసరార్థుల కొరకు సంపదను ఖర్చు చేయడం) అత్యంత ప్రభావవంతమైనది. ఖురాన్ దానగుణాన్ని శుభాలకు (బర్కత్‌కు), సాఫల్యానికి మూలంగా పేర్కొంది. పిసినారితనం చూపడం సర్వనాశనానికి దారితీస్తుందని హెచ్చరించింది.

అల్-బఖరా (2:261)లో అల్లాహ్ ఒక అద్భుతమైన ఉదాహరణను ఇచ్చాడు:

తమ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చుచేసే వారి ఖర్చు ఉపమానం ఇలా ఉంటుంది: ఒక్క విత్తనాన్ని నాటితే, అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపచేస్తాడు. అల్లాహ్ మహా విశాల హృదయుడు, సర్వజ్ఞుడు.- విశ్లేషణ

ఈ ఆయత్ ముగింపులో దాగి ఉన్న మూడు ముఖ్య విషయాలు:

**1. సమస్త సృష్టికి ఆయనే యజమాని :** భూమ్యాకాశాలలోని సమస్త నిధులు అల్లాహ్ కే సొంతం. కాబట్టి ఆయన తన దాసులకు అపరిమితంగా ఇవ్వగలడు.

**2. అపరిమితమైన దాతృత్వం :** ఆయన ఇచ్చే అనుగ్రహానికి హద్దులు లేవు. కేవలం ఏడు వందల రెట్లే కాదు, అంతకంటే ఎక్కువగా కూడా ప్రసాదిస్తాడు.

**3. ఆయనకు సమస్తం తెలుసు :** దానం చేసే దాసుడు ఏ ఉద్దేశంతో (నియ్యత్‌తో), ఏ పరిస్థితిలో, ఏ పద్ధతిలో ఇస్తున్నాడో దేవునికి బాగా తెలుసు. ఆ అంతర్గత పవిత్రత ఆధారంగానే పుణ్యాల స్థాయి పెరుగుతుంది.

## ప్రవక్త గారి హితబోధ- నిజమైన వారసత్వ సంపద

హజ్రత్ అబ్దుల్లా ఇబ్న్ మస్ఊద్ (రజిఅల్లాహు అన్హు) ఉల్లేఖించిన హదీసులో, ప్రవక్త గారు సహాబాలను ఇలా ప్రశ్నించారు:

"మీలో తన స్వంత సంపద కంటే తన వారసుల సంపదను ఎక్కువగా ప్రేమించేవారు ఎవరైనా ఉన్నారా?" సహాబాలు, "ఓ

ప్రవక్తా! మాలో ప్రతి ఒక్కరికీ తన స్వంత సంపద అంటేనే ఎక్కువ ఇష్టం'' అని సమాధానమిచ్చారు.

అప్పుడు ప్రవక్త గారు ఎంతో వివేకంతో ఇలా వివరించారు: ''మీ స్వంత సంపద అంటే కేవలం మీరు పుణ్యకార్యాల కోసం ఖర్చు చేసి, పరలోకానికి ముందుగా పంపుకున్నది మాత్రమే (దీని ప్రతిఫలం అల్లాహ్ వద్ద భద్రంగా ఉంటుంది). ఇక మీరు వెనుక వదిలి వెళ్ళే సంపద మీ వారసులది అవుతుంది.'' (రియాజుస్ సాలిహీన్)

### సాఫల్యానికి రాజమార్గం

విశ్వాసం (ఈమాన్), సత్కార్యాలతో (అమలె సాలెహ్) అలంకరించబడిన అల్లాహ్ దాసులకు పరలోకంలో లభించే విజయమే నిజమైన సాఫల్యం.

ఖురాన్ విశ్వాసులకు ఎంతో సమగ్రమైన శైలిలో ఈ శుభవార్తను అందిస్తోంది:

''ఓ విశ్వాసులారా! రుకూ చేయండి, సజ్దా చేయండి, మీ ప్రభువును మాత్రమే ఆరాధించండి, మేలు (పుణ్యకార్యాలు) చేయండి-దీనివల్ల మీరు సాఫల్యం పొందుతారు.'' (అల్-హజ్ 22:77)

అలాగే ముఅమిన్ (40:40) లో అల్లాహ్ ఇలా వాగ్దానం చేశాడు:

''ఎవరైతే సత్కార్యాలు చేస్తారో-వారు పురుషులైనా, స్త్రీలైనా-కానీ వారు విశ్వాసులై ఉండాలి; అలాంటి వారు స్వర్గంలో ప్రవేశిస్తారు, అక్కడ వారికి లెక్కింపు లేని అపారమైన వరాల నిధి ప్రసాదించబడుతుంది.''

కాబట్టి, హృదయపూర్వక విశ్వాసంతో, పవిత్రమైన ఉద్దేశంతో నిరంతరం సత్కార్యాల మార్గంలో పయనించడమే ఇహపరాల విజయానికి ఏకైక రాజమార్గం.

# మారుతున్న కాలంలో మన మాతృభాష

**నేటి** వేగవంతమైన ప్రపంచంలో మనం గడియారంతో పోటీ పడుతున్నాం. అన్నీ 'స్మార్ట్' అయిపోయాయి, కానీ మనసులోని మాటను మనసారా చెప్పుకునే 'భాష' మాత్రం ఎక్కడో వెనుక బడిపోతోంది. నిజానికి భాష అంటే కేవలం సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం కాదు, అది మన మూలాలను గుర్తు చేసే ఒక మధురమైన స్పర్శ.

### యాంత్రిక జీవితంలో భాష

ఈ రోజుల్లో మనమంతా కీబోర్డుల మీద, షార్ట్ మెసేజ్‌ల మీద ఆధారపడుతున్నాం. భావోద్వేగాల కంటే ఎమోజీలకే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ క్రమంలో మన మాతృభాషలోని తీయదనాన్ని కోల్పోతున్నాం. భాష అనేది హృదయాల మధ్య అనుసంధానం. కానీ నేడు మనం పరాయి భాషా వ్యామోహంలో పడి, మన ఇంటి భాషను కేవలం ఇంటికే పరిమితం చేస్తున్నాం, లేదా పూర్తిగా మర్చిపోతున్నాం.

### అమ్మ మాట - అమృతపు మూట

మాతృభాష అంటే మన అమ్మ నేర్పిన మొదటి మాట.

మనం ఎంతో చదువుకోవచ్చు, విదేశాల్లో స్థిరపడవచ్చు. కానీ గాఢమైన బాధ కలిగినా, అమితమైన ఆనందం కలిగినా మన నోటి నుండి వచ్చే మొదటి మాట మన మాతృభాషలోనే ఉంటుంది. ఎందుకంటే అది మన రక్తంలోనే ఉంది.

**ఒత్తిడి లేని అభ్యాసం :** నేడు పిల్లల మీద చదువుల భారం పెరుగుతోంది. పరాయి భాషలో పాఠాలు అర్థం కాక వారు ఒత్తిడికి లోనవుతున్నారు. అదే మాతృభాషలో చదువు చెబితే, అది భారంగా కాకుండా ఒక ఆహ్లాదకరమైన అనుభవంగా మారుతుంది.

### మన బాధ్యత

మనం ఆధునికతను ఆహ్వానించాలి, ఇతర భాషలను నేర్చుకోవాలి. కానీ అది మన మాతృభాషను పక్కన పెట్టి కాదు.

**ఇంటి నుండే ప్రారంభం :** మన పిల్లలతో ఇంట్లో మన మాతృభాష లోనే మాట్లాడదాం.

**భాషను బ్రతికించుకుందాం :** అప్పుడప్పుడు మన భాషలోని కథలు, కవితలు చదువుదాం. మన పండుగలు, సంప్రదాయాల వెనుక ఉన్న అర్థాన్ని మన భాషలోనే పిల్లలకు వివరిద్దాం.

భాష అనేది మన సంస్కృతికి వెన్నెముక. ఈ యాంత్రిక ప్రపంచంలో మనం యంత్రాలుగా మారిపోకుండా ఉండాలంటే, మన భావాలకు ప్రాణం పోసే మన మాతృభాషను మనం కాపాడుకోవాలి. మన భాష మన అస్తిత్వం; అది మన గౌరవం.

"భాష మారినా, భావం మారదు. కానీ ఆ భావానికి ప్రాణం పోసేది మాత్రం మాతృభాషే."




## గత సంచిక తరువాయి

### ఇస్లామిక్ ప్రబోధకుల బాధ్యత

నేటి సైన్స్ అండ్ టెక్నాలజీ యుగంలో, ఇస్లామిక్ ప్రబోధకుల బాధ్యత మునుపటి కంటే ఎంతో పెరిగింది. సైన్స్ సాధిస్తున్న ప్రగతిని దేవుని ఉనికికి , ఆయన ఏకత్వానికి (తౌహీద్‌కు) సజీవ సాక్ష్యాలుగా ప్రపంచం ముందు ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణల వెలుగులో తౌహీద్ (దైవ ఏకత్వం), రిసాలత్ (దైవదౌత్యం), ఆఖిరత్ (పరలోకం)లను శాస్త్రీయ ఆధారాలతో నిరూపించాల్సి ఉంది.

ప్రపంచం నేడు ఒక కొత్త ఆలోచనా యుగంలోకి ప్రవేశించింది. గతంలో దేవుని ఉనికిపై లేదా మతంపై చర్చలు ఎక్కువగా తత్వశాస్త్ర (Philosophical) ధోరణిలో సాగేవి. కానీ నేటి ఆధునిక మానవుడు 'శాస్త్రీయ మైండ్ సెట్' (Scientific Mind) కలిగి ఉన్నాడు. అతడు ప్రతి విషయానికి నిరూపణ, పరిశీలన , హేతుబద్ధతను ఆశిస్తున్నాడు. అందుకే సాంప్రదాయక శైలిలో మాత్రమే ధర్మప్రబోధం (దావత్) చేయడం ఇప్పుడు సరిపోదు. నేటి ఆధునిక సైన్స్, టెక్నాలజీ, ఖగోళ శాస్త్రం, జీవశాస్త్రం (Biology), మానవీయ శాస్త్రాల (Human Sciences) వెలుగులో ఇస్లాం సత్యత్వాన్ని నిరూపించాల్సిన అవసరం ఉంది.

పవిత్ర ఖురాన్ మానవుడిని విశ్వ విశేషాలపై ఆలోచించమని పదేపదే పిలుపునిస్తుంది. ఈ పిలుపే నిజానికి శాస్త్రీయ ఆలోచనా విధానానికి (Scientific Thinking) పునాది. ఖురాన్ ఇలా అంటోంది:

"భూమీ, ఆకాశాల సృష్టిలో రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావడంలో, నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్నివేళలా అల్లాహ్‌ను స్మరించే వారున్నూ, భూమీ, ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారున్నూ అయిన వివేకవంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి." (ఆల్ ఇమ్రాన్: 190)

ఈ విశ్వంలోని ప్రతి అణువూ దేవుని ఉనికిని, ఆయన ఏకత్వాన్ని చాటిచెబుతోందని ఈ ఆయత్ స్పష్టం చేస్తోంది. ఆధునిక సైన్స్ ఈ సూచనలను మరింత స్పష్టంగా మన కళ్లముందు ఉంచింది. కాబట్టి, సైన్సును నాస్తికత్వానికి సాధనంగా కాకుండా, తౌహీద్‌ను (దైవ ఏకత్వాన్ని) నిరూపించే బలమైన ఆధారంగా మలచడం నేటి ప్రబోధకుల ప్రాథమిక కర్తవ్యం.

### ఆధునిక తరం అడుగుతున్న ప్రశ్నలు

నేటి మనిషి మొబైల్, ఇంటర్నెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

(AI), అంతరిక్ష పరిశోధనలు, జెనెటిక్ సైన్స్ (జన్యుశాస్త్రం) యుగంలో జీవిస్తున్నాడు. అతని మేధస్సులో ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి:

1. ఈ విశ్వం అసలు ఎలా ఉనికిలోకి వచ్చింది?

2. జీవం యొక్క ఆవిర్భావం ఎలా జరిగింది?

3. డీఎన్ఏ (DNA) లో అంతటి అపారమైన సమాచారం ఎక్కడి నుండి వచ్చింది?

4. విశ్వ నియమాలు ఇంత క్రమపద్ధతిలో ఎందుకు ఉన్నాయి?

5. అసలు మానవ చేతన (Consciousness), వివేకం యొక్క వాస్తవికత ఏమిటి?

ధర్మ ప్రబోధకులు గనుక ఈ ప్రశ్నలను నిర్లక్ష్యం చేస్తే, స్వయంగా ముస్లిం యువత సైతం నాస్తికత్వం వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉంది. అందుకే ఆధునిక భాషలో, వారికి అర్థమయ్యే శైలిలో ఇస్లాం పరిచయం జరగాలి. ఇతర మతాలు ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేకపోవడం వల్లే---సైన్స్ మరియు మతం పరస్పర విరుద్ధమైనవనే తప్పుడు భావన ప్రజల్లో ఏర్పడింది. కానీ వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. సైన్స్ ఎంత ముందుకు సాగుతుంటే, ఈ విశ్వం వెనుక ఒక అద్భుతమైన మాస్టర్ ప్లాన్ (Grand Design) ఉందనే విషయం అంతకంతకూ స్పష్టమవుతోంది.

**శాస్త్రీయ ఆధారాలు**

ఒక సమయం అంటూ ప్రారంభమైన ఏ వస్తువైనా తనంతట తానుగా ఉనికిలోకి రాలేదని ప్రబోధకులు స్పష్టం చేయాలి. విశ్వానికి ఒక ప్రారంభం (Beginning) ఉంది కాబట్టి, దానికి ఖచ్చితంగా ఒక కారణం (Cause) ఉండాలి. ఆ కారణమే- అపరిమిత శక్తి గల సృష్టికర్త!

విశ్వం ప్రాథమిక నియమాలు, స్థిరాంకాలు (Constants) ఎంతటి సునిశితమైన సమతుల్యతపై నిర్మించబడ్డాయో లోకానికి చాటి చెప్పాలి. దీనినే సైన్స్ పరిభాషలో "విశ్వపు ఫైన్-ట్యూనింగ్" (Fine-Tuning of the Universe) అంటారు. గురుత్వాకర్షణ శక్తిలో గానీ, కాంతి వేగంలో గానీ లేదా పరమాణు శక్తులలో (Atomic Forces) గానీ రవ్వంత తేడా వచ్చినా ఇక్కడ జీవం మనుగడ సాగించలేదు. మరి:

- ఈ మహా సమతుల్యతను ఎవరు నెలకొల్పారు?
- ఈ ప్రకృతి నియమాలను ఎవరు నిర్ణయించారు?
- జడపదార్థం తనంతట తానుగా ఇంత మేధస్సును ఎలా సంతరించుకుంటుంది?

ఇదంతా ఈ విశ్వాన్ని నడిపిస్తున్న ఒక పరమ శక్తిమంతుడైన, వివేకవంతుడైన పాలకుని వైపునకే సంకేతం చేస్తుంది. ఖురాన్ ఇలా అంటోంది:

"నీవు కరుణామయుని సృష్టిలో ఎలాంటి క్రమరాహిత్యాన్నీ చూడలేవు." (సూరహ్ అల్-ముల్క్: 3)

**(మిగతా 34వ పేజీలో...)**

# మట్టి గుణం... మనిషి గర్వం!

పరిమళాలు వెదజల్లే రోజా పూలను గుండెలకు హత్తుకున్నంత మాత్రాన ఒకరు 'గొప్ప' అయిపోరు... పొయ్యి మీద ఉడుకుతూ ఆకలి తీర్చే మట్టి కుండ మోసినంత మాత్రాన ఇంకొకరు 'తక్కువ' కాలేరు. పైపై మెరుగులను చూసి అహంకారంతో విర్రవీగే మనస్తత్వాలకు చురకత్తి లాంటిదే 'జాడీ– మట్టి కుండ'ల సంవాదం!

ఒక కుమ్మరి సంతలో తను చేసిన మట్టి పాత్రలను అమ్మకానికి పెట్టాడు. అందులో రంగులద్దిన ఒక అందమైన జాడీ... పక్కనే ఉన్న నల్లటి మట్టి కుండ'ను చూసి, "నేను సంపన్నుల ఇళ్లలో పూలమధ్య ఉంటాను, నువ్వు పేదోళ్ల ఇళ్లలో మురికిగా పడి ఉంటావు. నా జాతి వేరు, నీ జాతి వేరు" అంటూ కులప్రాతిపదికన ఈసడించుకుంది. అప్పుడు ఆ మట్టి కుండ' నవ్వి, "ఓ మూర్ఖుడా! మనమిద్దరం ఒకే గుంతలోని మట్టి నుంచి, ఒకే కుమ్మరి చేతిలో రూపుదిద్దుకున్నాం. రేపు పగిలిపోయాక కలవాల్సింది ఆ మట్టిలోనే!" అని హితవు పలికింది.

ఈ చిన్న కథ నేటి మానవ సమాజానికి ఎంతటి పెద్ద గుణపాఠం! మనుషుల మధ్య బేధాలు కేవలం గుర్తింపు కోసమే తప్ప, అహంకారం కోసం కాదని పవిత్ర ఖుర్ఆన్ (49:13) స్పష్టం చేస్తోంది: "అల్లాహ్ దృష్టిలో మీలో అందరికంటే ఎక్కువ గౌరవనీయుడు ఎవరంటే... మీలో ఎవరైతే ఎక్కువ దైవభీతి (సత్ప్రవర్తన) కలవారో ఆయనే!"

ప్రవక్త ముహమ్మద్(స) తన అంతిమ ప్రసంగంలో, "నల్లవానిపై తెల్లవానికి, తెల్లవానిపై నల్లవానికి ఏ విధమైన శ్రేష్ఠత లేదు. మీరంతా ఆదమ్ సంతానమే, ఆ ఆదమ్ మట్టితో సృష్టించబడ్డారు" అంటూ సమానత్వాన్ని చాటారు. అంతేకాదు, "ఎవరి హృదయంలో ఆవగింజంత అహంకారం ఉంటుందో, అతను స్వర్గంలో ప్రవేశించలేడు" అని హెచ్చరించారు.

కథలోని జాడీలాగే ఇవాళ చాలామంది కులం, డబ్బు చూసి తోటి మనుషులను హీనంగా చూస్తున్నారు. కానీ, ఎంతటి మేడల్లో బతికినా ఆఖరికి అందరూ కలిసిపోయేది ఆరు అడుగుల మట్టిలోనే! ఒకరి ఉన్నత స్థితికి కులమతాలు తోడ్పడవు. వినమ్రత, జ్ఞానంతో బతికేవారే అత్యున్నతమైన వారు. రూపాల అహంకారాన్ని వీడి, హృదయాల పవిత్రతను గౌరవించడమే అసలైన మానవత్వం!




## నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కదలికలు మందగించి, మహారాష్ట్రలోనే నిలిచిపోవడంతో దేశవ్యాప్తంగా వర్షపాతంలో భారీ లోటు నమోదైంది. జూన్ మొదటి రెండు వారాల్లో సాధారణంగా కురవాల్సిన 72.2 మిమీ వర్షపాతానికి గానూ కేవలం 42.6 మిమీ మాత్రమే కురిసిందని, దీంతో దేశవ్యాప్తంగా 41శాతం లోటు వర్షపాతం ఏర్పడిందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ముఖ్యంగా మధ్య భారతంలో అత్యధికంగా 67 శాతం లోటు రికార్డయ్యింది. అరేబియా సముద్రం నుండి తేమ గాలుల తీవ్రత తగ్గడం, సముద్రంలో బలమైన అల్పపీడనాలు ఏర్పడక పోవడం, 'మ్యాడెన్-జులియన్ అసిలేషన్' (MJO) వ్యవస్థ బలహీనపడటం వల్లే రుతుపవనాల విస్తరణ నిలిచిపోయినట్లు వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఈ ఆలస్యం రాబోయే ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

## గడ్డుకాలంలో పారిశ్రామికం

దేశీయంగా డిమాండ్ కొరత, అంతర్జాతీయ సరఫరా అంతరాయాల కారణంగా భారత పారిశ్రామిక రంగంలోని ఎనిమిది కీలక మౌలిక రంగాల వృద్ధి రేటు మే 2026లో ఏడు నెలల కనిష్ట స్థాయి అయిన 0.5 శాతానికి మందగించింది. మొత్తం ఎనిమిది రంగాలలో ఐదు రంగాలు క్షీణతను ఎదుర్కొన్నాయి; ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి (-9.3%), పెట్రోలియం రిఫైనరీ (-8.7%) ఉత్పత్తులు భారీగా పడిపోగా, ముడి చమురు, సహజ వాయువు, ఎరువుల ఉత్పత్తి కూడా తగ్గాయి. అయితే, విద్యుత్ (8.7%), సిమెంట్ (8.4%), ఉక్కు (5%) రంగాలు మాత్రమే సానుకూల వృద్ధిని సాధించి పరిశ్రమకు కొంత ఊరటనిచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్ ఒత్తిళ్లు, చమురు దిగుమతులు పెరగడం వల్లే దేశీయ ఉత్పత్తిపై ఈ ప్రభావం పడిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ముస్లింల వివక్షపై దేశవ్యాప్త ఉద్యమం!

## ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (AIMPLB) సంచలన నిర్ణయం

దేశంలో ముస్లిం మైనారిటీల సామాజిక, రాజకీయ పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (AIMPLB) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న తీవ్ర వివక్ష, హక్కుల హననంకు వ్యతిరేకంగా త్వరలోనే ఒక సమగ్ర 'శ్వేతపత్రం' (నివేదిక) విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మైనారిటీల ఉనికిని చాటుకునేందుకు, రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఒక విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించ తలపెట్టినట్లు బోర్డు వెల్లడించింది. సంస్థ అత్యున్నత కార్యవర్గ సమావేశం అనంతరం బోర్డు అధికార ప్రతినిధి ఎస్.క్యూ.ఆర్. ఇలియాస్ ఈ మేరకు కీలక నిర్ణయాలను మీడియాకు వివరించారు. దేశంలో ముస్లింల ప్రాణాలు, ఆస్తులు, ఆత్మగౌరవంతో పాటు వారి మతపరమైన విశ్వాసాలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని బోర్డు కార్యవర్గం ఆవేదన వ్యక్తం చేసింది. "బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న మూక దాడులు (లించింగ్), అక్రమ బుల్‌డోజర్ కూల్చివేతలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' నిర్బంధం వంటి చర్యలు సమాజంలో అభద్రతా భావాన్ని పెంచుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కమాల్ మౌలా మసీదు వివాదంలో ఇటీవలి కోర్టు తీర్పు ముస్లింల శతాబ్దాల నాటి ఆరాధనా సంప్రదాయాలకు, 'ప్లేసెస్ ఆఫ్ వర్షిప్ యాక్ట్, 1991' (ఆరాధనా స్థలాల పరిరక్షణ చట్టం) స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం" అని ఇలియాస్ ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంలో న్యాయపోరాటం చేస్తున్న స్థానిక కమిటీకి బోర్డు తరపున పూర్తి చట్టపరమైన సహాయం అందిస్తామని స్పష్టం చేశారు.

**ఉమ్మడి పౌర స్మృతి (UCC) అమలుపై అభ్యంతరం :** ఉత్తరాఖండ్, గుజరాత్ తరహాలోనే అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో సైతం ఉమ్మడి పౌర స్మృతి (UCC)ని బలవంతంగా రుద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాలను బోర్డు తీవ్రంగా తప్పుపట్టింది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో భాగమైన UCCని న్యాయస్థానాలు సైతం నిర్బంధంగా అమలు చేయలేవని గుర్తుచేసింది. కాగా, మదరసాల్లో వందేమాతరం ఆలపించాలనే ప్రభుత్వ ఉత్తర్వులపై కలకత్తా హైకోర్టు ఇచ్చిన మధ్యంతర స్టేను బోర్డు ఈ సందర్భంగా స్వాగతించింది.

**జూలై ఆఖరులో 'యాక్షన్ కమిటీ' రంగంలోకి...:** ముస్లింల సామాజిక, రాజకీయ వెలివేతకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య సూత్రాల పునరుద్ధరణ కోసం దేశవ్యాప్త సమరానికి బోర్డు శంఖారావం పూరించింది. దేశంలోని లౌకికవాదులు, న్యాయం, శాంతిని కాంక్షించే అన్ని వర్గాలను ఏకం చేస్తూ ఒక బృహత్ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యాచరణను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక 'యాక్షన్ కమిటీ'ని ఏర్పాటు చేశామని, జూలై మాసాంతం నాటికి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఊపందుకుంటాయని ఇలియాస్ వెల్లడించారు. ఈ చారిత్రాత్మక సమావేశానికి AIMPLB అధ్యక్షుడు మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి మౌలానా ఫజ్లూర్ రహీమ్ ముజద్దిదీ పర్యవేక్షణలో దేశవ్యాప్త ప్రతినిధులు పాల్గొన్నారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం:

## కొడుకును చంపిన హంతకుడికి ఉరిశిక్ష పడే క్షణాల్లో ప్రాణభిక్ష పెట్టిన తండ్రి!

**న్యాయస్థానం విధించిన ఉరిశిక్ష అమలు కావడానికి ఇంకా కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది... ప్రాణ భయంతో ఆ హంతకుడు, కొడుకును కోల్పోయిన పుత్రశోకంతో ఆ తండ్రి ఇద్దరూ కాలంతో పోటీ పడుతున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతున్న తరుణంలో, అక్కడ ఒక అద్భుతం జరిగింది. కక్షలు, కార్పణ్యాల కంటే మానవత్వం గొప్పదని చాటుతూ, తన కుమారుడిని పొట్టనబెట్టుకున్న హంతకుడిని ఉరిశిక్ష నుండి తప్పించి ఒక తండ్రి ప్రాణభిక్ష పెట్టారు. సౌదీ అరేబియాలో జరిగిన ఈ హృదయ విదారక, అపూర్వ సంఘటన ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.**



### ఆ కన్నీళ్లే కరిగించాయి..

సౌదీ అరేబియాలోని అసీర్ ప్రాంతానికి చెందిన షేక్ యహ్యా బిన్ ఖాన్స్ అల్-ఖాహ్తాని కుమారుడు కొన్నేళ్ల క్రితం ఒక ఘర్షణలో దారుణ హత్యకు గురయ్యారు. సుదీర్ఘ విచారణ అనంతరం స్థానిక న్యాయస్థానం నిందితుడికి మరణశిక్ష ఖరారు చేసింది. శిక్ష అమలుకు కొద్ది గంటల ముందు, హంతకుడి కుటుంబ నేపథ్యం షేక్ యహ్యాకు తెలిసింది. సదరు నిందితుడు తన వృద్ధురాలైన తల్లికి ఏకైక కుమారుడని, ఆమె బతుకుదెరువుకు ఆయనే ఏకైక ఆధారమని తెలుసుకుని ఆ తండ్రి మనసు కరిగిపోయింది. ఒక కొడుకును కోల్పోతే ఆ తల్లి పడే వేదన ఎలా ఉంటుందో స్వయంగా అనుభవిస్తున్న ఆయన, మరో తల్లికి ఆ శోకం మిగల్చకూడదని భావించారు.

### పైసా తీసుకోకుండా షరతులు లేని క్షమాభిక్ష

సౌదీ చట్టాల (ఖిసాస్) ప్రకారం, హత్య కేసుల్లో బాధితుడి కుటుంబం భారీ మొత్తంలో పరిహారం (బ్లడ్ మనీ) తీసుకుని నిందితుడిని క్షమించే అవకాశం ఉంది. కానీ, షేక్ యహ్యా అల్-ఖాహ్తాని మాత్రం ఎలాంటి ఆర్థిక పరిహారాన్ని ఆశించలేదు. శిక్ష అమలుకు కొన్ని గంటల ముందు ఆయన నేరుగా హంతకుడి ఇంటికి వెళ్లారు. అక్కడ ఉన్న దోషి వృద్ధ తల్లి సమక్షంలోనే ఆమె కుమారుడిని క్షమిస్తున్నట్లు ప్రకటించారు.

"నా కొడుకు రక్తానికి నేను ఎలాంటి ధర కట్టలేను. నా బిడ్డ ప్రాణానికి బదులుగా డబ్బు తీసుకోవడం నాకు ఇష్టం లేదు. కేవలం ఆ అల్లాహ్ కోసమే, మానవత్వంతో నేను అతడిని క్షమిస్తున్నాను" అని షేక్ యహ్యా కన్నీటి పర్యంతమవుతూ పేర్కొన్నారు.

ఆయన తీసుకున్న ఈ నిర్ణయంతో ఉరిశిక్ష పడాల్సిన హంతకుడు చావు అంచుల నుంచి బతికి బయటపడ్డాడు.

### తబూక్ ప్రాంతంలోనూ ఇటువంటిదే మరో ఘటన

సౌదీ అరేబియాలో ఇటువంటి ఉదంతం చోటుచేసుకోవడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలో తబూ76ఎఎబక్ ప్రాంతానికి చెందిన అవద్ సులేమాన్ అల్-అమ్రాని అనే మరో తండ్రి కూడా ఇలాగే మానవత్వాన్ని చాటుకున్నారు. తన కుమారుడిని చంపిన వ్యక్తికి ఉరిశిక్ష అమలు చేయడానికి కేవలం కొద్ది నిమిషాల సమయం ఉందనగా, ఆయన నిందితుడిని క్షమించి మరణశిక్ష నుంచి విముక్తి కల్పించారు. సౌదీ చట్టాల్లోని 'ఖిసాస్' నిబంధనలు బాధితుల కుటుంబాలకు ఇటువంటి హక్కును కల్పిస్తుండటంతో, అనేక కుటుంబాలు కక్ష సాధింపుల కంటే క్షమాగుణానికే ప్రాధాన్యత ఇస్తున్నాయి.

### ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రశంసలు

కంటికి కన్ను, పంటికి పన్ను అనేలా సాగే కఠిన చట్టాల మధ్య, షేక్ యహ్యా ప్రదర్శించిన క్షమాగుణం, ఉదార స్వభావం సోషల్ మీడియా వేదికగా ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది నెటిజన్లను భావోద్వేగానికి గురిచేస్తోంది. "సొంత కొడుకును చంపిన వాడిని క్షమించడానికి ఎంతటి గుండె ధైర్యం, ఎంతటి దయా హృదయం కావాలి" అంటూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆయనకు నీరాజనాలు పలుకుతున్నారు. కక్షతో రగిలిపోయే సమాజానికి ఈ తండ్రి చూపిన క్షమాగుణం ఒక గొప్ప పాఠమని నెటిజన్లు కొనియాడు తున్నారు.

# సైన్స్ ప్రగతి
# నాలుగు ప్రధాన ప్రభావాలు

31వ పేజీ తరువాయి

అదేవిధంగా, ప్రతి మానవ కణంలో ఉన్న (DNA) లో బిలియన్ల కొద్దీ పేజీల సమాచారం భద్రపరచబడి ఉంది. అదొక పరిపూర్ణ బ్లూప్రింట్. ఒక చిన్న పుస్తకమే రచయిత లేకుండా ఉనికిలోకి రానప్పుడు, డీఎన్ఏ లాంటి అత్యంత సంక్లిష్టమైన సమాచార వ్యవస్థ (Information System) ఒక సృష్టికర్త లేకుండా ఎలా సాధ్యమవుతుంది? ఈ పాయింట్‌ను ప్రబోధకులు ఎంతో ప్రభావవంతంగా ప్రజల ముందు ఉంచవచ్చు.

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఉదాహరణ

నేడు మనిషి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)ను సృష్టిస్తున్నాడు. ఒక సాధారణ AI ప్రోగ్రామ్ వెనుక కూడా ఒక ఇంజనీర్, ఒక ప్రోగ్రామర్, ఒక డిజైనర్ ఉంటారు. మరి అలాంటప్పుడు - మానవ మెదడు, అతని చేతన (Consciousness), ఆలోచనలు, భావోద్వేగాల వెనుక ఒక సృష్టికర్త లేడని ఎలా అనగలం? ప్రబోధకులు నేటి ఆధునిక ఉదాహరణలతో ఇలా వివరించవచ్చు:

➢ ప్రోగ్రామర్ లేకుండా ప్రోగ్రామ్ పుట్టదు!

➢ డిజైనర్ లేకుండా డిజైన్ రూపుదిద్దుకోదు!

➢ నిపుణులు లేకుండా నియమం (Law) ఏర్పడదు!

అలాగే, ఒక సృష్టికర్త (Creator) లేకుండా ఈ అనంత విశ్వం ఉనికిలోకి రావడం అసాధ్యం.

నవ్య నాస్తికత్వానికి (New Atheism) మేధోపరమైన సమాధానం

నేడు సోషల్ మీడియా, యూట్యూబ్, విశ్వవిద్యాలయాలలో నాస్తికత్వ ఆలోచనలు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయి. యువత మనస్సులలో అనుమానాలను రేకెత్తిస్తున్నారు. కాబట్టి నేటి ప్రబోధకులు తప్పనిసరిగా:

➢ నాస్తికత్వ తత్వశాస్త్రాన్ని (Philosophy of Atheism) లోతుగా అధ్యయనం చేయాలి.

➢ ఆధునిక శాస్త్రీయ చర్చలను అవగాహన చేసుకోవాలి.

➢ యువత మానసిక స్థాయికి తగినట్లుగా మాట్లాడాలి.

➢ కేవలం భావోద్వేగ నినాదాలు కాకుండా, మేధోపరమైన ఆధారాలను (Intellectual Arguments) సమర్పించాలి.

పూర్వం ప్రవక్త ఇబ్రాహీం (అ) వారు కూడా నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుని ఉదాహరణల ద్వారా హేతుబద్ధమైన వాదనను ప్రజల ముందు ఉంచారు. ఇస్లాం అనేది వివేకం, పరిశీలనల ఆధారంగానే దైవమార్గానికి ఆహ్వానిస్తుందని దీని ద్వారా స్పష్టమవుతోంది.

నేటి యుగంలో ఒక ప్రభావవంతమైన ప్రబోధకుడు (దాఈ) ఎవరవుతారంటే:

➢ ఖురాన్, హదీసులపై పూర్తి పట్టు ఉన్నవారు.

➢ ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన ఉన్నవారు.

➢ తత్వశాస్త్రం (Philosophy), తర్కశాస్త్రాన్ని (Logic) అర్థం చేసుకోగలవారు.

➢ సైకాలజీ (మనస్తత్వశాస్త్రం), సోషియాలజీ (సమాజ స్త్ర6శాస్త్రం) తెలిసినవారు.

➢ ఆధునిక మీడియాను సరిగ్గా ఉపయోగించడమే కాక, యువత మాట్లాడే భాషలో వారితో సంభాషించగలవారు.

అందుకే అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు:

"ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమమైన రీతిలో వాదించు." (అన్ నహ్ల్: 125)

వివేకంతో దైవమార్గం వైపు పిలవడం అంటే-ఇస్లామిక్ విశ్వాసాలను బలమైన తార్కిక ఆధారాలతో ప్రజలకు వివరించడమే.

నిజానికి, ఈ సైన్స్ అండ్ టెక్నాలజీ యుగం ఇస్లామిక్ ప్రబోధకులకు లభించిన ఒక సువర్ణావకాశం. గతంలో మనుషులు దేవుని ఉనికిని కేవలం తత్వశాస్త్రంలో వెతుక్కునేవారు. కానీ నేడు సమస్త విశ్వం, ఖగోళ విశేషాలు, జీవశాస్త్రం, డీఎన్ఏ, భౌతికశాస్త్రం, మానవ చేతన యొక్క సంక్లిష్టతలు దేవుని అపార శక్తికి సాక్ష్యాలు పలుకుతున్నాయి.

కాబట్టి, నేటి దాఈల బాధ్యత ఏమిటంటే:

❖ సైన్సును నాస్తికత్వానికి కాదు, తౌహీద్‌కు నిదర్శనంగా మార్చాలి.

❖ నవతరం మనస్సులలో రేకెత్తుతున్న మేధోపరమైన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలి.

❖ విశ్వాసానికి (ఈమాన్‌కు), వివేకానికి (Reason) మధ్య ఉన్న అద్భుత సమన్వయాన్ని స్పష్టం చేయాలి.

❖ ఇస్లాం అనేది కేవలం ఆధ్యాత్మిక మతం మాత్రమే కాదు, హేతుబద్ధంగా, శాస్త్రీయంగా కూడా అత్యంత బలమైన, ఆమోదయోగ్యమైన జీవన విధానం అని నిరూపించాలి.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2026-2028 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**